


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 243 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం శనివారం 11 జూలై 2026 వెల : 1/-రూ ॥
VOLUME :1 ISSUE : 243 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SAT 11 JULY 2026 PRICE : 1/- RS
Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## అరెస్టు చేసినా, చంపేసినా సిద్ధమే.. బంగ్లాదేశ్‌కు వెళ్లి తీరుతాను: షేక్ హసీనా

- డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లనున్న మాజీ ప్రధాని షేక్ హసీనా
- కోర్టు ఎదుట లొంగిపోతానని సంచలన ప్రకటన
- తనతో పాటు అవామీ లీగ్ సీనియర్ నేతలు కూడా వస్తారని వెల్లడి
- 2024లో ప్రజా ఉద్యమంతో పదవి కోల్పోయి భారత్‌లో ఆశ్రయం

- మిగతా 2లో

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం!

## చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు ఇవిగో!



### సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం
రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్, రెస్పాన్స్ సెల్ ఏర్పాటు
ఫోరెన్సిక్ టూల్స్‌తో దుర్వినియోగాన్ని అరికట్టడం

### టూరిజం ప్రోత్సాహానికి కొత్త పాలసీ
కాన్సర్ట్స్, కార్నివాల్స్‌కు రూ.2 నుంచి రూ.5 కోట్ల వరకు
ఆర్థిక సహాయం.. ప్రభుత్వ మైదానాల ఉచితం

### రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్
13 ప్రాజెక్టులకు ఆమోదం
31,431 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు

### సాగునీటి ప్రాజెక్టులకు ఆమోదం
పెద్దగడ్డ ప్రాజెక్టుకు ఆమోదం
చెరువుల నీటికి రూ.67.98 కోట్ల పనులకు గ్రీన్ సిగ్నల్

### అమరావతి రైతులకు గుడ్ న్యూస్
వార్షిక కౌలు పెంపు: మెట్టకు రూ.40 వేలు,
జరీబుకు రూ.60 వేలు... 10 సంవత్సరాలు చెల్లింపు

### భూ సమస్యల పరిష్కారానికి చర్యలు
పుల్లడిగుంటలో 200 కుటుంబాలకు పట్టాలు
మార్చి 2027 నాటికి అన్ని రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

### ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మంచి అవకాశం
మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
ఐఐటీ, నీట్, జేఈఈకు అత్యుత్తమ శిక్షణ

### మరికొన్ని ముఖ్యమైన ఆమోదాలు
విశాఖలో NIA కోర్టు, టీడీపీ కార్యాలయాలకు భూములు
రైతుల ధాన్యం సేకరణకు రూ.1800 కోట్ల రుణం

- మిగతా 2లో

## పుంగనూరులో ఈవీ క్లస్టర్.. ప్రతి 30 కి.మీ.కు ఛార్జింగ్ స్టేషన్

- ఏపీలో ఆటోమోటివ్, ఈవీ ఎకోసిస్టమ్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- పుంగనూరులో ఈవీ క్లస్టర్, గ్రీన్ కారిడార్లలో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు
- కొరియా సంస్థల కోసం ప్రత్యేకంగా రెండు ఆటో కాంపోనెంట్ పార్కులు
- కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీలో రేర్ ఎర్త్ కారిడార్ నిర్మాణం
- సియోల్‌లో కొరియా ఆటో పరిశ్రమ ప్రతినిధులతో మంత్రి లోకేశ్ భేటీ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) రంగం లో దేశానికే హబ్‌గా మార్చేం దుకు పటిష్టమైన ప్రణాళికలతో ముందుకెళుతున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన "సుస్థిర ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0" కింద రాష్ట్రంలో విస్తృతమైన ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ప్రయాణంలో

- మిగతా 2లో



## రష్యా చమురు క్షేత్రాలపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి.. తీవ్ర ఇంధన సంక్షోభం!

- ఉక్రెయిన్ దాడుల్లో రష్యాలోని ఆరు చమురు డిపోలు ధ్వంసం
- రష్యాలోని పలు ప్రాంతాల్లో తీవ్ర ఇంధన కొరత
- 73 ఉక్రేనియన్ డ్రోన్లను కూల్చేశామన్న రష్యా
- 72 ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకున్నామన్న ఉక్రెయిన్

- మిగతా 2లో

## ఒకే స్క్రిప్ట్‌తో... ఆ ముగ్గురూ పవన్‌ను టార్గెట్ చేశారు



- పవన్‌ను లక్ష్యంగా చేసుకుని జడా శ్రావణ్, ప్రకాశ్ రాజ్, రావణ్ కుట్ర అంటూ మంత్రి ఫైర్
- వీరి వెనుక వైసీపీ, తాడేపల్లి స్క్రిప్ట్ ఉందని కందుల దుర్గేశ్ ఆరోపణ
- జగన్‌పై పోరాటానికి రూ. 25 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో శ్రావణ్ చెప్పాలని డిమాండ్
- ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకే మత ఘర్షణలు రెచ్చగొడుతున్నారని ఫైర్
- ప్రశ్నించడం అంటే బూతులు తిట్టడమేనా అని తీవ్ర విమర్శ

- మిగతా 2లో

# జేఎన్‌టీయూ స్నాతకోత్సవం విజయనగరంలోనే జరపాలి

## గవర్నర్‌కు బొత్స లేఖ



- జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం వేదికను మార్చొద్దన్న బొత్స
- విజయనగరం జిల్లాలోనే నిర్వహించాలని గవర్నర్‌కు విన్నపం
- విశాఖ ఆంధ్ర యూనివర్శిటీలో నిర్వహించాలనుకోవడం సరికాదని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:విజయనగరం జిల్లాలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం వేదికను మార్చాలన్న నిర్ణయంపై ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నంలో కాకుండా విజయనగరంలోనే నిర్వహించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆయన ఒక లేఖ రాశారు.స్నాతకోత్సవానికి తనను ఆహ్వానించినందుకు గవర్నర్ కు బొత్స ధన్యవాదాలు తెలిపారు. "విజయనగరం లాంటి వెనుకబడిన జిల్లాలో విద్యా రంగాన్ని పరుగులు పెట్టించేందుకు ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. అలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు సంబంధించిన మొట్టమొదటి స్నాతకోత్సవాన్ని అదే జిల్లాలో జరపడమే అత్యంత సముచితం. ఈ అట్టహాస వేడుకను విజయనగరంలో కాకుండా, విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించాలని అనుకోవడం సరికాదు. ఈ నిర్ణయం వల్ల విజయనగరం జిల్లా ప్రజల ఆత్మగౌరవం దెబ్బతింటుంది. అక్కడ ఈ వేదిక మార్పుపై తీవ్ర నిరసనలు, తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజల, విద్యార్థుల ఆకాంక్షలు, ఆనందాన్ని గౌరవించాల్సిన బాధ్యత

- మిగతా 2లో

## ఇరాన్ ప్రియతమ నేతకు కన్నీటి వీడ్కోలు..

### ఖమేనీ అంతిమయాత్రకు 4 కోట్లకు పైగా జనం



- మషద్‌లోని ఇమామ్ రెజా పవిత్ర క్షేత్రంలో ఖననం
- ఆరు రోజుల పాటు జరిగిన అంతిమయాత్రకు 4.3 కోట్ల వరకు జనం హాజరు
- ఇరాన్‌తో పాటు ఇరాక్‌లోనూ భారీగా పాల్గొన్న ప్రజలు

- మిగతా 2లో



## ఒకరికి మించి భార్యలుంటే ప్రభుత్వ ఉద్యోగం ఊస్ట్..

### అసోంలో కొత్త నిబంధనలు

- బహుభార్యత్వం పాటిస్తే ప్రభుత్వ పథకాలకు అనర్హులు
- ఇద్దరు భార్యలున్న ప్రభుత్వ ఉద్యోగులను తొలగించాలని నిర్ణయం
- అసోం 2026-27 బడ్జెట్‌లో ఈమేరకు కీలక ప్రతిపాదనలు
- మహిళా సాధికారత కోసమే ఈ చర్యలని ప్రభుత్వం స్పష్టీకరణ

- మిగతా 2లో

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం



- పదేళ్లు అధికారంలో ఉన్న హరీశ్ రావు కుంగిపోయే ప్రాజెక్టులు కట్టారన్న మహేశ్ గౌడ్
- ఇప్పుడు ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని వ్యాఖ్య
- ఈటల బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా ఉందని ఎద్దేవా

- మిగతా 2లో

## కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు

- నాకు తెలంగాణే మొదటి ప్రాధాన్యం.. ఆ తర్వాతే పార్టీ అన్న ఈటల
- ప్రభుత్వం వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్
- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని తప్పుబట్టడం దుర్మార్గమని కాంగ్రెస్‌పై విమర్శలు
- కాళేశ్వరం వల్లే ఉత్తర తెలంగాణలో రెండు పంటలు సాధ్యమయ్యాయని వ్యాఖ్య
- ప్రాజెక్టుల మరమ్మతుల్లో జాప్యం చేస్తే తీవ్ర కరవు వస్తుందని ప్రభుత్వానికి హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:ప్రజల ప్రయోజనాల విషయంలో తనకు తెలంగాణే మొదటి ప్రాధాన్యమని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత అంశాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాను ఎవరో చెప్పినట్లు మాట్లాడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన..

- మిగతా 2లో



## 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధాని...

### మోదీకి ఘనస్వాగతం

- మూడు దేశాల పర్యటనలో భాగంగా అక్లాండ్ చేరుకున్న ప్రధాని మోదీ
- దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత అక్కడ పర్యటిస్తున్న ఓ భారత ప్రధాని
- ఎయిర్‌పోర్ట్‌లో మోదీకి స్వయంగా స్వాగతం పలికిన ప్రధాని క్రిస్టఫర్ లక్సన్
- వాణిజ్యం, ఆర్థిక సంబంధాలపై ఇరు దేశాల ప్రధానుల మధ్య చర్చలు

- మిగతా 2లో




## ఎల్‌నినో హెచ్చరికల మధ్య ఖరీఫ్ సంక్షోభం
### కరువు కాటుకు రైతాంగం విలవిల...
### ఇక ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన కదలాలి

వ్యవసాయ ఆధారిత రెండు తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమే తీవ్ర అనిశ్చితితో మొదలైంది. ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించినప్పటికీ, ఆ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు అవసరమైన స్థాయిలో ముందస్తు ప్రణాళికలు రూపొందించలేకపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు కొన్ని పత్రికలు, టెలివిజన్ ఛానళ్లు విస్తారంగా వర్షాలు కురుస్తాయని ప్రచారం చేసినప్పటికీ, వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి.జూన్ నెల ముగిసే సమయానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోని అనేక జిల్లాల్లో నేల తడవకపోవడం ఆందోళన కలిగించే అంశం. తెలంగాణలో సగటుతో పోలిస్తే సుమారు 58 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 63 శాతం వరకు వర్షపాతం లోటు నమోదైంది. ఖరీఫ్ సాగుకు అత్యంత కీలకమైన తొలి నెలలోనే ఇంతటి వర్షాభావం ఏర్పడటం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేసింది. గత శతాబ్దానికి పైగా ఇలాంటి పరిస్థితి అరుదుగా కనిపించిందని వ్యవసాయ నిపుణులు, రైతులు అభిప్రాయపడుతున్నారు.

వ్యవసాయ రంగం రెండు రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 80 లక్షల ఎకరాలు, తెలంగాణలో దాదాపు 68 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతుంది. ఉద్యాన, కూరగాయల పంటలను కలుపుకుంటే కోటి ఎకరాలకు పైగా సాగు ఈ సీజన్‌పై ఆధారపడి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో తొలి దశలోనే వర్షాభావం ఏర్పడటం మొత్తం వ్యవసాయ చక్రాన్నే దెబ్బతీసే ప్రమాదం ఉంది.

నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించి కొద్దిపాటి వర్షాలు కురిపించిన తర్వాత మళ్లీ బలహీనపడటంతో రైతులు విత్తనాలు వేసేందుకు కూడా వెనుకంజ వేస్తున్నారు. ధైర్యం చేసి విత్తనాలు చల్లిన రైతులకు కూడా మొలకలు రాక పెట్టుబడులు వృథా అవుతున్నాయి. ప్రభుత్వాలు పంపిణీ చేసిన రాయితీ విత్తనాలు గోదాముల్లో నిల్వ ఉండిపోవడం, కొంతమంది రైతులు వాటిని నూనె గింజలుగా విక్రయించే పరిస్థితి రావడం వ్యవసాయ సంక్షోభానికి నిదర్శనం.రాయలసీమతో పాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్ వంటి వర్షాధార ప్రాంతాల్లో వేరుశెనగ, పత్తి, కంది, జొన్న, సజ్జ వంటి పంటల సాగు పూర్తిగా వర్షాలపై ఆధారపడి ఉంటుంది. వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. పంటలు వేయలేకపోవడం, వేసిన పంటలు మొలకెత్తకపోవడం, కూలీలకు వ్యవసాయ పనులు లేక నిర్మాణ రంగంలోకి వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.నీటి వనరుల పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల వంటి ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేవు. ఎగువ రాష్ట్రాల్లో కూడా నిల్వలు తక్కువగా ఉండటంతో సాగునీటి భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. గోదావరి వరదలు రాకపోతే పట్టిసీమ ద్వారా కూడా తగినంత నీటి సరఫరా కష్టమవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.భూగర్భ జలాలు ఇప్పటికే ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయి. వరుసగా వర్షాభావం కొనసాగితే తాగునీటి సమస్య కూడా తీవ్రమయ్యే అవకాశం ఉంది. విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ బోర్లలో నీరు లేకపోతే రైతుకు ప్రయోజనం ఉండదు. పశుగ్రాసం కొరతతో పాడి పరిశ్రమ కూడా సంక్షోభంలో పడే ప్రమాదం ఉంది. పచ్చిగడ్డి లేక రైతులు అధిక ధరలకు దాణా కొనాల్సి వస్తోంది. దీని ప్రభావం పాల ఉత్పత్తుల ధరలపై కూడా పడుతుంది.కరువు ప్రభావం కేవలం వ్యవసాయానికే పరిమితం కాదు. గ్రామీణ ఉపాధి తగ్గిపోవడం, వలసలు పెరగడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలహీనపడటం, తాగునీటి సమస్యలు, పశుసంపద నష్టం వంటి అనేక సామాజిక, ఆర్థిక సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి కరువును కేవలం ప్రకృతి విపత్తుగా కాకుండా సమగ్ర అభివృద్ధి సమస్యగా ప్రభుత్వాలు పరిగణించాలి.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. వర్షాభావ జిల్లాలను వెంటనే గుర్తించి కరువు ప్రకటించేందుకు అవసరమైన సర్వేలు పూర్తి చేయాలి. తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి. రైతులకు ఉచితంగా లేదా రాయితీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి. ఉపాధి హామీ పథకాన్ని విస్తృతంగా అమలు చేసి గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించాలి. వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి. పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేసి పాడి రైతులను ఆదుకోవాలి. తాగునీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. అవసరమైతే రైతులు తీసుకున్న పంట రుణాలకు వాయిదా, వడ్డీ రాయితీ, తీవ్ర నష్టపోయిన ప్రాంతాల్లో రుణమాఫీ వంటి చర్యలను కూడా పరిశీలించాలి.

ఎల్‌నినోను ఎవరూ అడ్డుకోలేరు. కానీ దాని ప్రభావాన్ని తగ్గించే సమర్థవంతమైన పరిపాలన మాత్రం ప్రభుత్వాల చేతుల్లోనే ఉంటుంది. ప్రకృతి విపత్తును ప్రజా విపత్తుగా మారనీయకుండా ముందస్తు ప్రణాళిక, సమన్వయం, వేగవంతమైన చర్యలతో రైతాంగానికి అండగా నిలవాల్సిన సమయం ఇదే. రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది. వ్యవసాయం బతికితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. అందుకే కరువు నివారణను అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని ప్రభుత్వాలు వెంటనే కార్యాచరణ ప్రారంభించాలి. ఇదే నేటి అత్యవసర అవసరం

## ఇరాన్ ప్రియతమ నేతకు కన్నీటి వీడ్కోలు..

ఇరాన్ అధినేత అయతొల్లా సయ్యద్ అలీ ఖమేనీ అంత్యక్రియలు ముగిశాయి. ఆరు రోజుల పాటు జరిగిన అంతిమయాత్ర అనంతరం, మషద్ నగరంలోని పవిత్ర ఇమామ్ రెజా పుణ్యక్షేత్రంలో ఆయన పార్థివ దేహాన్ని ఖననం చేశారు. ఇరాన్, ఇరాక్‌లలో జరిగిన ఈ అంతిమ యాత్ర కార్యక్రమాలలో సుమారు 4.1 కోట్ల నుంచి 4.3 కోట్ల మంది ప్రజలు పాల్గొన్నారని అంచనా. అంతిమ సంస్కారాలకు ముందు ఖమేనీ భౌతికకాయాన్ని ఇమామ్ రెజా పుణ్యక్షేత్రం చుట్టూ ప్రదక్షిణ చేయించి, డార్ అల్-ధిక్ర్ ప్రార్థనా మందిరంలో ఖననం చేశారు. పాయంబర్-ఎ-ఆజం ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేవలం కుటుంబ సభ్యుల సమక్షంలో చివరి వీడ్కోలు కార్యక్రమం జరిగింది. మషద్ నగరంలో జరిగిన అంతిమయాత్రలో వీధులన్నీ జనసంద్రంగా మారాయి. ఊహించని రీతిలో జనం పోటెత్తడంతో సమీప రహదారులపై కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాల్సి వచ్చింది. ఇరాన్‌కు చెందిన ‘ఫార్స్ న్యూస్ ఏజెన్సీ’ కథనం ప్రకారం టెహ్రాన్, ఖోమ్, నజాఫ్, కర్‌బలా, మషద్‌లలో జరిగిన కార్యక్రమాలకు హాజరైన వారి సంఖ్యను రవాణా రికార్డులు, మొబైల్ ఫోన్ డేటా, క్రౌడ్-డెన్సిటీ విశ్లేషణల ఆధారంగా అంచనా వేశారు. ఒక్క ఇరాక్‌లోని నజాఫ్, కర్‌బలాల్లోనే దాదాపు కోటి మంది పాల్గొన్నారని ఆ దేశ అధికారులు ధ్రువీకరించారు. గత శుక్రవారం ప్రారంభమైన ఈ నివాళి కార్యక్రమాలలో 45కు పైగా దేశాల ప్రతినిధులు, 90కి పైగా దేశాల నుంచి పండితులు పాల్గొన్నారు. ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, భారత్, టర్కీ, నైజీరియా వంటి దేశాల నుంచి కూడా ప్రజలు తరలివచ్చి నివాళులు అర్పించారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై 40 రోజుల యుద్ధం ప్రారంభమైన మొదటి రోజే, ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ ఉగ్రదాడికి పాల్పడ్డాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఈ దాడిలోనే ఖమేనీ, ఆయన అల్లుడు, ఒక కుమార్తె, 14 నెలల మనవరాలు, అలాగే నూతన అధినేత అయతొల్లా సయ్యద్ ముజ్తబా ఖమేనీ భార్య కూడా అమరులయ్యారు.

## ఒకరికి మించి భార్యలుంటే ప్రభుత్వ ఉద్యోగం ఊస్ట్..

బహుభార్యత్వంపై అసోం ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది భార్యలు ఉన్నవారికి ఇకపై ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించవని స్పష్టం చేసింది. అంతేకాకుండా, బహుభార్యత్వం పాటిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను సర్వీసు నుంచి తొలగించనున్నట్లు ప్రకటించింది. శుక్రవారం ప్రవేశపెట్టిన 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ మేరకు ప్రతిపాదనలు చేసింది.అసోం ఆర్థిక మంత్రి జయంత మల్లా బారువా శుక్రవారం శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బహుభార్యత్వం పాటిస్తున్న ఏ పురుషుడైనా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు అనర్హుడవుతారని ఆయన సభకు వెల్లడించారు. మహిళా సాధికారత, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. దీనికోసం ‘అసోం సర్వీసెస్ (డిసిప్లిన్ అండ్ అప్పీల్) రూల్స్-1964’కు సవరణలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సైతం ఒక మీడియా సమావేశంలో ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారు.బహుభార్యత్వాన్ని అరికట్టేందుకు అసోం ప్రభుత్వం గత కొంతకాలంగా కఠినంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా 2025 నవంబర్‌లోనే “అసోం బహుభార్యత్వ నిషేధ బిల్లు, 2025”ను అసెంబ్లీలో ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం, మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో వివాహం చేసుకోవడం నేరం. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే గరిష్ఠంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. అయితే, కొన్ని షెడ్యూల్డ్ తెగలకు, ఆరో షెడ్యూల్ ప్రాంతాలకు ఈ చట్టం నుంచి మినహాయింపు కల్పించారు.

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం...
# చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు ఇవిగో!

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు.

**సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం**

సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు.

రాష్ట్ర స్థాయిలో ఒక ‘సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్’ ఏర్పాటు.

దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు ‘రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్’ ఏర్పాటు.

విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫొరెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు.

సోషల్ మీడియా కేసుల దర్యాప్తుపై ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ పరిజ్ఞానం ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీల) నియామకం.

ఇతర దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడంపై పరిశీలన.

**భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్**

రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (రాఖ్పదీ) ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు.

**అమరావతిపై కీలక నిర్ణయాలు**

అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు.

అలాగే, గ్రామ కంతాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు, అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

**విద్యారంగానికి పెద్దపీట**

సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు “సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్” ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు.

**టూరిజం ప్రోత్సాహానికి కొత్త పాలసీ**

ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో సంగీత కచేరీలు (జశీఎవతీం), కార్నివాల్స్ వంటి భారీ ఈవెంట్లను నిర్వహించే వారికి ‘వయబిలిటీ గ్యాప్ ఫండింగ్’ కింద ఆర్థిక సహాయం అందించనుంది. 20,000 మంది లోపు హాజరైతే రూ.2 కోట్లు, 20,000 నుంచి 50,000 మధ్య హాజరైతే రూ.5 కోట్లు, 50,000 దాటితే రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుంది. దీనికి తోడు, ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద మైదానాలను ఉచితంగా వాడుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది.

**సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణ**

సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఐదుసార్లు టెండర్లు విఫలమైన నేపథ్యంలో, 14.88 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని అందించే పనులకు రూ.67.98 కోట్లకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ‘జలధార’ కార్యక్రమం పురోగతిని సమీక్షించాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, పశుగ్రాసంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

**భూ సమస్యల పరిష్కారానికి చర్యలు**

దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 200 కుటుంబాలకు ఊరట కల్పిస్తూ, వారు నివసిస్తున్న 10.16 ఎకరాల ‘తోపు పోరంబోకు’ భూమిని పట్టా భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇలాంటి భూ వర్గీకరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేలాది కుటుంబాలకు న్యాయం చేస్తామని, మార్చి 2027 నాటికి పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు.

**మరికొన్ని ముఖ్యమైన ఆమోదాలు**

అనంతపురం, మంగళగిరి, రాయదుర్గంలో టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి భూమి కేటాయింపు.

విశాఖపట్నంలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు.

రైతుల నుంచి వరి ధాన్యం సేకరణ, ఖరీఫ్ విత్తనాల కోసం ఎన్‌సిడిసి నుంచి రూ.1800 కోట్ల రుణం సమీకరణ.

తిరుపతి సమీపంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు భూ కేటాయింపు.

హైకోర్టులో ఒక రిజిస్ట్రార్ పోస్టు మంజూరు.

కాగా, ఈ కేబినెట్ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ గైర్హాజరయ్యారు. పవన్ భుజం శస్త్రచికిత్స కోసం ముంబై వెళ్లనున్న నేపథ్యంలో ఆయన నేటి సమావేశానికి దూరంగా ఉన్నారు. ఇక, ఐటీ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ప్రస్తుతం దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే.

## 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధాని...

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా ఈరోజు న్యూజిలాండ్‌లో అడుగుపెట్టారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనలను ముగించుకుని ఆయన శుక్రవారం ఆక్లాండ్‌కు చేరుకున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల విరామం తర్వాత న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న తొలి భారత ప్రధానిగా మోదీ నిలిచారు. ఆక్లాండ్ విమానాశ్రయంలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టఫర్ లక్సన్ స్వయంగా మోదీకి సాదర స్వాగతం పలికారు.రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ప్రధాని మోదీ, లక్సన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఈ భేటీలో ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవలే పురోగతి సాధించిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చల నేపథ్యంలో ఈ పర్యటనకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ పర్యటనలో భాగంగా మోదీ ప్రవాస భారతీయులను ఉద్దేశించి కూడా ప్రసంగించనున్నారు.భారత్ ‘యాక్ట్ ఈస్ట్ పాలసీ’, ‘మహాసాగర్’ విజన్‌ను బలోపేతం చేయడంతో పాటు, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ ప్రాంతం పట్ల తమ నిబద్ధతను ఈ పర్యటన పునరుద్ఘాటిస్తుందని మోదీ తన పర్యటనకు ముందు ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మార్చిలో లక్సన్ జరిపిన భారత పర్యటనతో వచ్చిన సానుకూలతను ఈ పర్యటన

మరింత ముందుకు తీసుకెళుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఆస్ట్రేలియా పర్యటనలో ప్రధాని మోదీ రక్షణ, సముద్ర సహకారాన్ని పెంపొందించుకోవడంతో పాటు, భారత్‌కు యురేనియం సరఫరాకు వీలు కల్పించే కీలకమైన పౌర అణు ఇంధన ఒప్పందం కుదుర్చుకున్నారు. అంతకుముందు ఇండోనేషియా పర్యటనలో కీలక ఖనిజాలు, సముద్ర భద్రత వంటి అంశాలపై పలు కీలక ఒప్పందాలు చేసుకున్నారు.

## ఒకే స్క్రిప్ట్‌తో... ఆ ముగ్గురూ పవన్‌ను టార్గెట్ చేశారు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వైసీపీ భారీ కుట్రకు తెరలేపిందని, అందులో భాగంగానే జడా శ్రావణ్ కుమార్, నటుడు ప్రకాశ్ రాజ్, యూట్యూబర్ జోసెఫ్ రావణ్ పనిచేస్తున్నారని రాష్ట్ర మంత్రి, జనసేన నేత కందుల దుర్గేశ్ సంచలన ఆరోపణలు చేశారు. పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ ముగ్గురూ తాడేపల్లి నుంచి వస్తున్న ఒకే స్క్రిప్ట్‌ను అమలు చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేధావుల ముసుగులో వీరు చేస్తున్న ప్రయత్నాలు, వైఎస్ జగన్‌తో జడా శ్రావణ్ భేటీ కావడంతో బట్టబయలయ్యాయని అన్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్, జడా శ్రావణ్‌ను లక్ష్యంగా చేసుకుని పలు సూటి ప్రశ్నలు సంధించారు. “జగన్‌పై పోరాటానికి రూ. 25 కోట్లు సొంత డబ్బులు ఖర్చు పెట్టానని చెప్పిన శ్రావణ్‌కు అంత సొమ్ము ఎలా వచ్చిందో చెప్పాలి. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన, తక్కువ కాలం జడ్జిగా పనిచేసి, తర్వాత సాధారణ న్యాయవాదిగా ఉన్నారు. అలాంటి వ్యక్తికి అంత డబ్బు ఎలా వస్తుంది? మాకు తెలిసిన సమాచారం ప్రకారం, అవినీతి కేసుల్లో ఉండటం వల్లే ఆయన జడ్జి ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అలాగే, సుగాలి ప్రీతి తల్లిని మోసం చేసిన మాట వాస్తవం కాదా?” అని దుర్గేశ్ నిలదీశారు. పవన్ కల్యాణ్ ఏనాడూ శ్రావణ్ ప్రస్తావన తేకపోయినా, కేవలం వైసీపీ ఆదేశాలతోనే శ్రావణ్ పదేపదే పవన్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు.జోసెఫ్ రావణ్, శ్రావణ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య ఉన్న ‘క్యాష్ బంధం’ ఏంటో బయటపెట్టాలని దుర్గేశ్ డిమాండ్ చేశారు. “రావణ్‌ను అరెస్ట్ చేస్తే శ్రావణ్ ఎందుకు అంతగా ఇబ్బంది పడుతున్నారు? ప్రశ్నించే హక్కు అంటే బూతులు తిట్టడమేనా? వ్యక్తిత్వ హననం చేసేవారిని వెనకేసుకు రావడమేనా మీ పని?” అని ప్రశ్నించారు. ఈ ముగ్గురూ కలిసి ఏపీలో క్రైస్తవులను రెచ్చగొట్టి మతాల మధ్య ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీని వెనుక వైసీపీ ఎజెండా స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు.ప్రకాశ్ రాజ్ గురించి మాట్లాడుతూ, “కర్ణాటకలోని ధర్మస్థల పుణ్యక్షేత్రంపై, అక్కడి ఆచారాలపై ఆయన చేసిన విమర్శలు అందరికీ తెలుసు. ఆ కుట్ర కేసులో అరెస్ట్ అయిన చిన్నయ్య అనే వ్యక్తి, ప్రకాశ్ రాజ్ చీకటి కోణాన్ని బయటపెట్టాడు. ఆ కేసు నుంచి తప్పించుకోవడానికే ప్రకాశ్ రాజ్ ఏపీలో ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాడు” అని దుర్గేశ్ ఆరోపించారు.

పవన్ కల్యాణ్

ఆదాయంపై శ్రావణ్ చేస్తున్న విమర్శలను దుర్గేశ్ తిప్పికొట్టారు. “ఒక పెద్ద హీరో సినిమా పూర్తికావడానికి రెండు, మూడు సంవత్సరాలు పడుతుంది. 2024 ఎన్నికల అఫిడవిట్‌లో పవన్ తన ఆదాయ వివరాలను స్పష్టంగా పేర్కొన్నారు. అయినా కొత్త వాదనలు తేవడం విడ్డూరం. పవన్‌ను ఒక కులానికో, మతానికో పరిమితం చేయాలని, సనాతన ధర్మంపై దుర్మార్గపు మాటలు మాట్లాడాలని వీరందరికీ తాడేపల్లి నుంచే స్క్రిప్ట్ వస్తోంది” అని దుర్గేశ్ విమర్శించారు. రోజురోజుకీ బలోపేతం అవుతున్న కూటమి ప్రభుత్వాన్ని బలహీనపరిచి, అస్థిరపరచడమే వీరి ఏకైక ధ్యేయమని ఆరోపించారు. ఈ కుట్రను తాము తప్పనిసరిగా ఎదుర్కొంటామని, ప్రజా క్షేత్రంలో వారి ముసుగు తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## రష్యా చమురు క్షేత్రాలపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి.. తీవ్ర ఇంధన సంక్షోభం!

రష్యా ఆర్థిక జీవనాడి అయిన చమురు శుద్ధి కర్మాగారాలు, ఇంధన నిల్వ కేంద్రాలే లక్ష్యంగా ఉక్రెయిన్ తన డ్రోన్ దాడులను ముమ్మరం చేసింది. రష్యాలోని స్టావ్‌రోపోల్, ట్వెర్, ఉఫా ప్రాంతాలతో పాటు క్రిమియాలోని కీలక చమురు పంపింగ్ స్టేషన్‌లను తమ దళాలు పూర్తిగా ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. యుద్ధాన్ని ముగించడానికి మాస్కో నిరాకరిస్తుండడం వల్లే ఈ దాడులు పెంచామని, రష్యా వెనక్కి తగ్గే వరకు ప్రతిరోజూ అక్కడ యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తామని ఆయన హెచ్చరించారు.నిన్న రాత్రి నుంచి ఈ తెల్లవారుజాము వరకు కొనసాగిన ఈ దాడుల్లో రష్యాలోని దాదాపు ఆరు చమురు డిపోలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అజోవ్ సముద్రంలోని రెండు చమురు ట్యాంకర్లపై కూడా డ్రోన్లు విరుచుకుపడ్డాయి. ఈ దాడుల ప్రభావంతో రష్యాలోని పలు ప్రాంతాల్లో తీవ్ర పెట్రోల్ కొరత ఏర్పడింది. ఇంధనం కోసం వాహనదారులు బంకుల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.తాము 73 ఉక్రేనియన్ డ్రోన్‌లను కూల్చివేశామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మరోవైపు, నిన్న రాత్రి రష్యా దళాలు తమపై ప్రయోగించిన 94 డ్రోన్‌లు, రెండు బాలిస్టిక్ క్షిపణులలో 72 డ్రోన్‌లను సమర్థవంతంగా అడ్డుకున్నామని ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించింది. ఈ పరస్పర దాడులతో ఇరు దేశాల మధ్య యుద్ధం సరికొత్త స్థాయికి చేరింది.

## హరీశ్ రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే
## పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రతిపక్షాలపై విమర్శల జడివాన కురిపించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని ఘాటు వ్యాఖ్యలు చేశారు.పదేళ్లు అధికారంలో ఉండి కుంగిపోయే ప్రాజెక్టులు కట్టిన మీరు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని మహేశ్ గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మార్క్ అభివృద్ధి చూసి ఆయనకు మిట్టమధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయన్నారు. హరీశ్ రావు ఒకవేళ కాంగ్రెస్‌లోకి వస్తానంటే... తమ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో (పీఏసీ) చర్చించి నిర్ణయం తీసుకుంటామని వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతీయ పార్టీ అయిన బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు ఎలా జమ అయ్యాయో చెప్పాలని నిలదీశారు.నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉండి నీళ్ల దోపిడీని ప్రశ్నించని ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్... ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా కనిపిస్తోందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అందరికీ ఒకటేనని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. కడియం శ్రీహరి, కొండా సురేఖ వివాదాలపై సచిన్ సావంత్, జగ్గారెడ్డిలతో కూడిన కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రతినిధులతో చర్చించి ఈ నెల 15న కొలిక్కి తెస్తామని కీలక అప్‌డేట్ ఇచ్చారు.

## అరెస్టు చేసినా, చంపేసినా సిద్ధమే..
## బంగ్లాదేశ్‌కు వెళ్లి తీరుతాను: షేక్ హసీనా

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. స్వదేశంలో మరణశిక్షను ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి న్యాయస్థానం ముందు లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న 78 ఏళ్ల హసీనా, ఒక మీడియా సంస్థకు టెలిఫోన్ ద్వారా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ విషయాలను స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీకి చెందిన ఇతర సీనియర్ నాయకులు కూడా స్వదేశానికి తిరిగి వస్తారని ఆమె పేర్కొన్నారు.“వారు నన్ను అరెస్టు చేయవచ్చు లేదా హతమార్చవచ్చు. ఏదేమైనా నేను వెళ్లాల్సిందే. ఒకవేళ మరణం సంభవిస్తే, అది నా తల్లిదండ్రులు విశ్రమిస్తున్న నా మాతృభూమిపైనే జరగాలి” అని హసీనా భావోద్వేగానికి లోనయ్యారు. మరణశిక్షను ఎదుర్కొంటున్న మరో సీనియర్ నాయకుడు, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్ కూడా ఆమెతో పాటు బంగ్లాదేశ్‌కు వెళ్లే వారిలో ఉన్నారు.2024లో విద్యార్థులు, సామాన్య ప్రజలు చేపట్టిన భారీ నిరసనల కారణంగా షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి విదితమే. సుమారు రెండు దశాబ్దాల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆమె, 2024 ఆగస్టులో ప్రాణరక్షణ కోసం భారత్‌కు చేరుకుని రాజకీయ ఆశ్రయం పొందారు. నిరసనల అణిచివేతలో చోటుచేసుకున్న హింసాకాండ, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాల ఆరోపణల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని ప్రత్యేక ట్రైబ్యునల్ 2025 నవంబర్‌లో ఆమెకు మరణశిక్ష విధించింది. ఆమె పార్టీ అయిన అవామీ లీగ్‌పై కూడా నిషేధం విధించారు. అయితే, తనపై నమోదైన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని హసీనా కొట్టిపారేశారు.

# పి ఎం శ్రీ పరిశీలించిన జిల్లా ఏ ఎం ఓ





వై రామవరం, పెన్ పవర్,జూలై 10 : మండలంలో కోట ఆశ్రమ ఉన్నత పాఠశాల( బాలురు)ను పోలవరం జిల్లా ఏ ఎం ఓ సందర్శించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి తెలిపారు. పాఠశాలలో పీఎం శ్రీ కి సంబంధించిన రికార్డ్స్, గేమ్స్ మెటీరియల్, సైన్స్ ల్యాబ్,సిసి కెమెరాలు పరిశీలించడం జరిగింది అని తెలిపారు. పీఎం శ్రీ ప్రారంభమైన నాటి నుండి ఎన్రోల్మెంట్ ఎలా ఉందో పరిశీలించారని తెలిపారు. పరిశుభ్రత,లైఫ్ స్కిల్స్ గురించి విద్యార్థులకు తెలియజేయడం జరిగిందన్నారు. విద్యార్థుల ఆరోగ్య విషయాలపై, విద్యాభివృద్ధిపై ఆసక్తి కలిగించే విధంగా విద్యాబోధన జరగాలని సూచించారు.

# పెన్ పవర్

పోలవరం - ఏలూరు

తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## ఘనంగా జాతీయ మత్స్య రైతుల దినోత్సవం




తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 19:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మత్స్య శాఖ ఆధ్వర్యంలో బాదంపూడిలో జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మత్స్య రంగంలో అభ్యున్నతి, నూతన సాంకేతికతలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విఆర్ గూడెం కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎ. దేవివరప్రసాద్ రెడ్డి హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. జాతీయ మత్స్య రైతుల దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో మెరుగైన ఉత్పాదకత సాధించడంలో నాణ్యమైన ప్రజననం ఎంతటి కీలక పాత్ర పోషిస్తుందో స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్రంలో పండించే చేపల దేశీయ వినియోగాన్ని పెంచాల్సిన అవసరాన్ని ఆయన ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. ఈ సదస్సులో మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ రాజ్‌కుమార్ గారు మాట్లాడుతూ.. నాణ్యమైన చేప పిల్లల ఉత్పత్తి , వాటి ఎంపికలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మరో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ రామకృష్ణ మాట్లాడుతూ.. ఆక్వాకల్చర్‌లో లాభాలు సాధించడానికి మరియు వ్యాధుల నివారణకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్య శాఖ అధికారులు, పెద్ద సంఖ్యలో మత్స్య రైతులు, ఆక్వా రంగానికి చెందిన ప్రముఖులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# పుష్కర్ నగర్లు, పార్కింగ్ ప్రాంతాలు గుర్తింపు

**జిల్లా కలెక్టర్ ఎస్పీ, క్షేత్రస్థాయి పరిశీలన**



**రాజమహేంద్రవరం పెన్ పవర్, జూలై 10** :రాబోయే గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లలో భాగంగా, శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ జిల్లా కలెక్టర్ శ్రీమతి కీర్తి చేకూరితో కలిసి పరిసర ప్రాంతాల్లో పుష్కర్ నగర్లు, పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాలు, బస్సుల నిలుపుదల ప్రాంతాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆటోనగర్, జీఎస్ఎల్ వెనుక ప్రాంతం, దివాన్ చెరువు జీరో పాయింట్, కేశవ హాస్పిటల్ రోడ్, గమన్ వంతెన--కాతేరు అండర్‌పాస్ ప్రాంతం, కాతేరు సీటీఆర్ఐ భూములు, వ్యవసాయ కళాశాల సమీప ప్రాంతం, తిరుమల బస్ గ్రౌండ్, తిరుమల పాపయ్య నగర్ పరిసర ప్రాంతాలను సందర్శించి, భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్, తాత్కాలిక వసతి, హోల్డింగ్ ఏరియాలు, షటిల్ బస్సుల నిర్వహణకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పించే అంశాలపై అధ్యయనం చేయడం కోసం ముందుగా అన్ని శాఖల అధికారులతో చర్చించడం జరిగినది.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# రీ-సర్వేపై గ్రామసభ నిర్వహణ



**భూయజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచన**

**గంగవరం, పెన్ పవర్ ,జూలై 10:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గంగవరం మండల కేంద్రంలోని గంగవరం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. మండలంలో అత్యధిక భూమి విస్తీర్ణం గంగవరం గ్రామంలోనే ఉన్నందున భూయజమానులు రీ-సర్వే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భూ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. గ్రామసభలో రీ-సర్వే ప్రక్రియ, భూ హద్దుల నిర్ధారణ, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్ఐ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, జనసేన గంగవరం మండల అధ్యక్షుడు కుంజం సిద్ధు, మాజీ సర్పంచ్ అక్కమ్మ, టీడీపీ నాయకుడు కొమ్మన చిన్నారావు, మాజీ ఎంపీటీసీ బుల్లియమ్మ సత్యవేణి, ప్రసాద్, పావని, బాబురావు, పీసా ఉపాధ్యక్షుడు శివ రామకృష్ణ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గంగవరం సచివాలయ పరిధిలో గిరిజన రైతులకు వరి విత్తనాల పంపిణీ



**వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని నాయకుల హామీ**

**గంగవరం, పెన్ పవర్ జూలై 10:** ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని గంగవరం సచివాలయ పరిధిలోని గ్రామాలకు చెందిన గిరిజన రైతులకు శుక్రవారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, రైతులకు అవసరమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి దిగుబడులు పెంచుకోవాలని ఆకాంక్షించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విత్తనాల వినియోగం, సాగు విధానాలపై అవగాహన కల్పించారు. రైతులు కూడా ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని పంటల ఉత్పాదకత పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, పీసా ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, బీజేపీ నాయకుడు వెంకటేశ్వర్లు దొర, పావని, హార్టికల్చర్ అసిస్టెంట్ కళ్యాణ్, రైతులు పాల్గొన్నారు.

## ది రాజమండ్రి నూతన కార్యవర్గం ఎన్నిక



**రాజమహేంద్రవరం పెన్ పవర్ జూలై 10:**సుదీర్ఘకాలంగా ఎన్నికలు లేకుండా నిస్తేజంగా ఉన్న ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం కోలాహలంగా జరిగాయి. ఇటీవల ఏర్పాటు అయిన అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో శ్రీరామ్ మూర్తి ప్యానల్, మోత సారథి, ప్యానల్, సత్య ప్యానల్ పోటీ పడ్డాయి. ప్రెస్ క్లబ్ లో 158మందికి సభ్యులు ఉన్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీపడిన శ్రీరామ్ మూర్తి మీద మోత సారథి ఒక ఓటు మెజారి టీతో గెలుపొందడం జరిగింది. క్లబ్ అభివృద్ధి, జర్నలిస్టుల సంక్షేమం, ఆధునిక సౌకర్యాల కల్పన లక్ష్యంగా కొత్త బృందం "ప్రెస్ క్లబ్ భవిష్యత్తుకు కొత్త బాటలు వేస్తామని నూతన అధ్యక్షుడు సారథి, వేణుగోపాల స్వామి లు తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా మోతా బాల విజయసారథి, కార్యదర్శిగా గంద్రోతు వేణుగోపాలస్వామి (గోపి), ఉపాధ్యక్షులుగా పి.ఎస్. గంగాధర్, కొత్తపల్లి దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా సోమాబత్తుల కృపానందం, కె.వి.ఎన్. వరప్రసాద్, కోశాధికారిగా శ్రీపాద పురుషోత్తమ కుమార్ బాధ్యతలు చేపట్ట నున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఆకుల ఈశ్వర్, కొట్టే మధు, ఆర్.వి.వి. సత్యనారాయణ, పి. చంటిబాబు, పాలపర్తి శ్రీనివాస్, గరగ ప్రసాద్, జి.వి. గోపాలకృష్ణ ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతన మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్‌ను మరింత అభివృద్ధి చేసి జర్నలిస్టులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విలేకరుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ, వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, సభ్యుల ఐక్యతను పెంపొందించే చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు సీనియర్ జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు అభినందనలు తెలియజేస్తూ, వారి పదవీకాలంలో ప్రెస్ క్లబ్ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మురికి నీరు ఎటు పోవాలి...





పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

- పెన్ పవర్ కథనానికి కథనానికి స్పందించిన అధికారులు
- డిప్యూటీ ఎంపీడీవో ఆదేశాలతో డ్రైనేజీ శుభ్రం, ప్రజలు హర్షం

**కూనవరం,పెన్ పవర్, జూలై10.** మురికి నీరు ఎటు పోవాలి పెన్ పవర్ శీర్షికతో జూలై 4న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కూనవరం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిలిచిన మురికి నీటిని తొలగించేందుకు డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథ రావు ఆదేశాలు ఇచ్చారు. శుక్రవారం పంచాయతీ సిబ్బంది పూడిక పనులు చేపట్టి డ్రైనేజీని శుభ్రం చేశారు. దీంతో చుట్టుపక్కల ప్రజలు,అటుగా వెళ్లేవారు దుర్వాసన నుండి ఉపశమనం పొందారు. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ,ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



# ఏఐసీటీఈ - అఖిల భారత ఇంజనీరింగ్, సాంకేతిక అండర్ గ్రాడ్యుయేట్ విద్యామండలి సభ్యునిగా నియమితులైన ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.రమణారావు





ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావుకు అభినందనలు తెలిపిన నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 10.**తాడేపల్లిగూడెం....అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో పనిచేసే అఖిల భారత ఇంజినీరింగ్ మరియు సాంకేతిక అండర్ గ్రాడ్యుయేట్ విద్యామండలి (ఏఐబియూజి) సభ్యునిగా ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు మాట్లాడుతూ అఖిల భారత ఇంజినీరింగ్ మరియు సాంకేతిక విద్య అండర్ గ్రాడ్యుయేట్ అధ్యయనాల మండలి సభ్యునిగా తనను నియమించటం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ బాధ్యతను తనకు అప్పగించిన అఖిల భారత సాంకేతిక విద్యామండలి అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. దేశంలోని ఇంజినీరింగ్ విద్యను మరింత నాణ్యతాపరంగా, సమర్థవంతంగా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దటంలో ఈ మండలి కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ వేదిక ద్వారా విద్యార్థి కేంద్రిత విద్య, ఫలితాల ఆధారిత బోధన, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, నవకల్పన, పారిశ్రామిక అనుసంధానం వంటి అంశాలకు ప్రాధాన్యం కల్పించేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ జాతీయ స్థాయి బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తూ, భారతదేశ ఇంజినీరింగ్ విద్యాభివృద్ధికి ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని వివరించారు.

ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావుకు వెల్లువెత్తిన అభినందనలు

అఖిల భారత ఇంజినీరింగ్ మరియు సాంకేతిక విద్య అండర్ గ్రాడ్యుయేట్ అధ్యయనాల మండలి సభ్యునిగా నియమితులైన ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.రామరావుకు ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎస్.జయరామ్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ జీబీ వీరేష్ కుమార్, అసోసియేట్ డీన్లు, పలువురు విభాగాధిపతులు, ఆచార్యులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ జాతీయ స్థాయి భాధ్యతను విజయవంతంగా నిర్వహిస్తూ, దేశంలోని ఇంజినీరింగ్ విద్యాభివృద్ధికి మరింత సేవలందించాలని, ఏపీ నిట్ కు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## బలుసులమ్మ శాఖాంబరి అలంకరణ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరణ.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 10:**తాడేపల్లిగూడెం గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు అర్చనలు జరిగాయి. శుక్రవారం సందర్భంగా అమ్మవారి కి విశేషా పూజలు నిర్వహించారు అనంతరం అమ్మవారికి విశేష అలంకరణలు చేశారు. ఆలయ నిర్వహకులు శ్రీరంగం రామాంజనేయులు (అంజి) ఆధ్వర్యంలో ఆలయ ఈఓ బీవీ చంద్రశేఖర్ నిర్వహణలో, ఆలయ అర్చకులు ప్రదీప్ శర్మ గోపీనాథ్ శర్మ, మల్లిఖార్జునశర్మ అర్చకత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెంలోని శ్రీ బలుసులమ్మ తల్లి ఆలయంలో ది. 17.07.2026(శుక్రవారం) న జరగనున్న శాఖాంబరి అలంకరణ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని బొలిశెట్టి రాజేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి అన్న సమాధా కార్యక్రమాన్ని నిర్వహించారు అన్నదానం జరిగింది, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయంలో ప్రతి వారం జరిగే అన్నదానికి భక్తులు అందరు సహకారించాలిన కోరారు,

## గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు చిన్న సత్యవతికి ఘన సన్మానం

### యూటీఎఫ్ గంగవరం మండల శాఖ ఆధ్వర్యంలో సత్కారం



**గంగవరం, పెన్ పవర్ జూలై 10:** గంగవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల నూతన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు స్వీకరించిన చెన్నాడ చిన్న సత్యవతిని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) గంగవరం మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 2014 నుంచి 2016 వరకు ఇదే పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలిగా సేవలందించిన చిన్న సత్యవతి, పదోన్నతి పొంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు స్వీకరించారు. విద్యాభివృద్ధి, విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి ఆమె చేస్తున్న కృషిని అభినందిస్తూ యూటీఎఫ్ నాయకులు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావంతో పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న చిన్న సత్యవతి సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆమె మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి విద్యారంగానికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి కే కృష్ణ ,గంగవరం మండల అధ్యక్షుడు బొజ్జిదొర, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు లోత రుక్మిణి దేవి, మండల కార్యదర్శి రాములకొండ చిన్న వెంకటరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హై స్కూల్లో రెండు లక్షల వ్యయంతో సైకిల్ స్టాండ్ నిర్మాణం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 10.** మన తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులకు ఉపయోగపడు సైకిల్ స్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది. సుమారు రెండు లక్షల రూపాయలు వ్యయంతో సైకిల్ స్టాండ్ నిర్మాణానికి ఖర్చువుతుందని. దీనికి ముఖ్య దాతలుగా కీర్తిశేషులు కొండూరు గంగరాజు జ్ఞాపకార్థం వారి సతీమణి మంగ మరియు వారి కుటుంబ సభ్యులు సహకారంతో ఈ శుక్రవారం శంకుస్థాపన చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా జడ్పీ హైస్కూలు డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ అయినటువంటి ఎన్ వి సత్యనారాయణ వారి మిత్రబృందం, పాఠశాల హెచ్ఎం, వాసవి క్లబ్ తాడేపల్లిగూడెం ప్రెసిడెంట్ ఆలపాటి కృష్ణ కుమార్, సెక్రటరీ ముత్తా శ్రీధర్ గుప్తా ట్రెజరర్ పులవర్తి సాయి ప్రశాంత్ జోన్ చైర్మన్ పసుమర్తి అనిల్, పాస్ట్ ప్రెసిడెంట్ డిస్టిక్ క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ నున్న సుందరరావు, పూర్వాధ్యక్షులు మండా బ్రహ్మాజీ, మరియు డైరెక్టర్స్ కాజు లక్ష్మయ్య, కొండూరు రాము, కొండూరి శ్రీ రంగనాయకులు హాజరైనారు. ఈ సైకిల్ స్టాండ్ తో పాటు సీనియర్ సిటిజన్స్ నిమిత్తం వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వక్తలు తెలియజేశారు. అదేవిధంగా శాసనసభ్యులు బోలిశెట్టి శ్రీనివాస్ ప్రజల భాగస్వామ్యంతో అనేక అభివృద్ధి కార్యక్రమలు చేస్తున్నారని హై స్కూల్ గ్రౌండ్, స్విమ్మింగ్ పూల్ త్వరలో జూనియర్ కాలేజ్ నిర్మాణాలు చేస్తున్నారని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని వక్తలు తెలియజేశారు.

## గిరిజన రైతులకు వరి విత్తనాల పంపిణీ



**గంగవరం, పెన్ పవర్, జూలై 10:** మర్రిపాలెం సచివాలయం పరిధిలోని గ్రామాలకు చెందిన గిరిజన రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, పీసా కార్యదర్శి కారం బాపన్నదొర, పీసా ఉపాధ్యక్షుడు రోల్లుపల్లి నూకరెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ కొప్పాక కళ్యాణ్ నాయుడు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## విజిలెన్సు కమిటీ సభ్యుడు గంగాధరరావును అభినందించిన ఆఫ్కాబ్ ఛైర్మన్ గన్ని



**పెన్ పవర్ -- ఉంగుటూరు । జులై 10:**వెట్టి చాకిరి నిర్మూలన వ్యవస్థ విజిలెన్సు కమిటీ సభ్యునిగా నియమితులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఇమ్మణి గంగాధరరావును ఆఫ్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అభినందించారు. శుక్రవారం భీమడోలులోని గన్ని క్యాంపు కార్యాలయంలో గంగాధరరావు తన అనుచరులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి తన నియామక విషయాన్ని తెలియజేశారు.

ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ, పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ మూడు పర్యాయాలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా సమర్థవంతంగా సేవలందించిన గంగాధరరావుకు కూటమి ప్రభుత్వం సముచితమైన నామినేటెడ్ పదవిని కల్పించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో మరింత గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో నాచుగుంట టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కొరపాటి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఘంటా ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## వంతెన స్లాబ్ నిర్మాణానికి మట్టి, బురద తొలగింపు పనులు ప్రారంభం



**పెన్ పవర్ -- ఉంగుటూరు । జూలై 10:**రావులపర్రు--ప్రకాశరావుపాలెం రహదారిలో రావులపర్రు--ఉంగుటూరు మధ్య పత్తేపురం పంటకాలువపై నిర్మిస్తున్న వంతెన స్లాబ్ పనుల కోసం అధికారులు శుక్రవారం జేసీబీతో మట్టి, బురద తొలగింపు పనులు చేపట్టారు.

ఈ వంతెన 2018లో కూలిపోవడంతో స్థానిక ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఈ వంతెనతో పాటు కాగుపాడు వెళ్లే కల్వర్టు నిర్మాణాలకు కలిపి రూ.80 లక్షల నిధులు మంజూరు చేసింది. అయితే గుత్తేదారుడు పనులు ప్రారంభించి 16 నెలలు గడిచినా ఇప్పటివరకు పూర్తి కాలేదు. కాంక్రీట్ బాటమ్, ఇరువైపుల రిటైనింగ్ గోడలు నిర్మించిన తర్వాత పనులు నిలిచిపోవడంతో పంటకాలువలో నీటి కారణంగా భారీగా మట్టి, బురద పేరుకుపోయింది.

ప్రస్తుతం వంతెన స్లాబ్ నిర్మాణానికి అవసరమైన ఐరన్ సెంట్రింగ్ ఏర్పాటు చేయడానికి వీలుగా ముందుగా మట్టి, బురద తొలగిస్తున్నట్లు ఆర్అండ్‌బీ అసిస్టెంట్ ఇంజనీర్ పి. భాస్కరరావు తెలిపారు.

ఈసారి అయినా వంతెన స్లాబ్ పనులు పూర్తి చేసి ప్రజలకు శాశ్వతంగా రాకపోకల సమస్యలను పరిష్కరించాలని రావులపర్రు గ్రామస్థులు కోరుతున్నారు.

## ఘనంగా జాతీయ చేపల రైతు దినోత్సవం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 10:** జాతీయ చేపల రైతు దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడియంలోని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి జాయింట్ డైరెక్టర్ ఎన్. నిర్మల కుమారి మాట్లాడుతూ, 1957 జూలై 10న ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో ఉన్న సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ లో శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి డాక్టర్ అలీ కున్హీ మెజర్ కార్ప్ చేపల విజయవంతమైన ప్రేరేపిత సంతానోత్పత్తి సాంకేతికతను అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని గుర్తిస్తూ ప్రతి సంవత్సరం జూలై 10ను జాతీయ చేపల రైతు దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం వల్ల నాణ్యమైన చేపల విత్తనాల ఉత్పత్తి గణనీయంగా పెరిగి, మత్స్యరంగ అభివృద్ధికి ఎంతోదోహదపడిందన్నారు. ప్రపంచంలో మంచినీటి చేపల ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో ఉండగా, దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలోకొనసాగుతున్నదని పేర్కొన్నారు.

చేపల పెంపకం గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన ఉపాధి వనరుగా మారి వేలాది కుటుంబాలకు జీవనోపా ధిని కల్పిస్తోందని నిర్మల కుమారి తెలిపారు. చేపలు అధిక పోషక విలువలు కలిగిన ఆహారమని, ఆహార భద్రతకు కూడా అవి కీలకమని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి చేపల విత్తనాలు వదలడం ద్వారా ఆహార ఉత్పత్తి పెంపుతో పాటు మత్స్యకారుల ఆదాయాన్ని కూడా పెంచవచ్చని సూచించారు.

ఈ సందర్భంగా అక్వా రైతులు మత్స్యరంగ ఆర్థికాభివృద్ధికి అందిస్తున్న విశేష సేవలను గుర్తించి సత్కర కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్, అనపర్తి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పులకుర్తి శ్రీనివాసు, శ్రీకృష్ణపట్నం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కొల్లాం రత్నంలను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ ఎం. బ్రహ్మానందం, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, రాష్ట్ర మత్స్య సహకార సంఘం జేఏసీ ఏ. సత్తిబాబు, జిల్లాలోని వివిధ మత్స్య సహకార సంఘాల సభ్యులు, శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంధ్రను క్రీడాహబ్ గా తీర్చిదిద్దుతా ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 10**
రాష్ట్ర ప్రభుత్వం ఛాంపియన్లతో బలమైన ఆంధ్రాను నిర్మిస్తుందని, క్రీడా యువత వేగంగా ముందుకు అడుగులు వేయాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. అమరావతి ఛాంపియన్‌షిప్--2026 -- ఒకే స్ఫూర్తి, ఒకే ఛాంపియన్‌షిప్, అపరిమితమైన అవకాశాలు అనే అంశాలతో ముద్రించిన గోడ పత్రికలను ఎమ్మెల్యే గోరంట్ల ఆవిష్కరించారు.
ఆసందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువత తమ క్రీడాప్రతిభను చాటుకునేందుకు అమరావతి ఛాంపియన్‌షిప్ -2026 ఒక చక్కని వేదికగా నిలుస్తుందని అన్నారు. క్రీడలు ద్వారా శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టుభావన పెంపొందుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
అమరావతి ఛాంపియన్‌షిప్ -- 2026 ను విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖలు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పోటీలు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చెయ్యాలని సూచించారు. ఛాంపియన్‌షిప్-2026 పోటీలు వివరాలు, వయో విభాగాలు 17 సంవత్సరాలు లోపు బాలురు ఒ బాలికలు, 23 సంవత్సరాలు లోపు యువకులు ఒ యువతులు పాల్గొనవచ్చునని తెలిపారు. విలువిద్య, అథ్లెటిక్స్, బాక్సింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో,వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, యోగా మొత్తం 12 క్రీడలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. నియోజకవర్గ స్థాయి ఎంపికలు, పోటీలు జూలై 15 నుండి 25 వరకు, జిల్లా స్థాయి పోటీలు ఎంపికలు జూలై 26 నుండి ఆగస్టు 10 వరకు, రాష్ట్ర స్థాయిపోటీలు ఆగస్టు 21 నుండి 26 వరకు జరుగుతాయని తెలిపారు. నగదు బహుమతులు మొత్తం విలువ రూ 91.90 లక్షలు రూపాయలు బహుమతులు ప్రదానోత్సవం ఆగస్టు 29 తేదీ జాతీయ క్రీడాదినోత్సవం రోజున (వేదిక నిర్ణయించవలసి ఉంది) అందజేయడం జరుగుతుందని తెలిపారు.
ఈకార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి డి. ఎం. ఎం. శేషగిరి , యోగ కోచ్ బి. వి. జి. నాగేంద్రన్, సీనియర్ యోగ గురువు కె. ఎస్. వి. శ్రీధర్ రెడ్డి, వాసంశెట్టి నాగబాబు, కొప్పిశెట్టి నాగేశ్వరావు, సూరపురెడ్డి జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల అనూప్ మహిళా డిగ్రీ కళాశాలలో సీఐ గజేంద్ర కుమార్ అవగాహన కార్యక్రమం...



**అడ్డతీగల ,పెన్ పవర్, జూలై 10;** అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం .గజేంద్ర కుమార్ , ఎస్ఐ వి. వినోద్ ఆధ్వర్యంలో శుక్రవారం అడ్డతీగల అనూప్ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా సురక్షిత వినియోగం మరియు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ గజేంద్ర కుమార్ మాట్లాడుతూ మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, అందుబాటులో ఉన్న భద్రతా వ్యవస్థలు మరియు అత్యవసర సహాయ హెల్ప్‌లైన్ సేవల గురించి వివరించారు. విద్యార్థినులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సైబర్ భద్రత మరియు వ్యక్తిగత రక్షణకు సంబంధించిన తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఎస్సై వినోద్ మాట్లాడుతూ మహిళల భద్రతకు పటిష్టమైన చట్టాలు అమల్లో ఉన్నాయని, మహిళలను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే నేరుగా తమకు సమాచారం అందించాలని ఎస్సై విద్యార్థినులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కాలేజీ కరస్పాండెంట్ సి. హెచ్ ఆశీర్వాదం, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## జంబుపట్నంలో ముమ్మరంగా సాగుతున్న తాగునీటి పనుల పురోగతి

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాలతో
- రంగంలోకి జనసేన నాయకుడు అడపా శ్రీనివాస్ మరియు మండల అధికారులు



**కోరుకొండ, పెన్ పవర్, జులై 10:** జంబుపట్నం గ్రామంలో ఎదురవుతున్న తీవ్ర తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాల మేరకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో, ఆయన ముఖ్య అనుచరుడు మరియు జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులను పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు అడపా శ్రీనివాస్ మండల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగారు. పనులు వేగవంతం చేసి, ప్రతి ఇంటికీ నీరు అందేలా చూడటం కోసం ఆయన అధికారులను సమన్వయం చేసుకుంటూ రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్నారు. ఈ సందర్భంగా అడపా శ్రీనివాస్ మాట్లాడుతూ, "ప్రజల కనీస అవసరమైన తాగునీటి సమస్యను తీర్చడమే మా మొదటి ప్రాధాన్యత. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దిశానిర్దేశంలో అధికారులు, సిబ్బంది అందరూ అంకితభావంతో పనిచేస్తున్నారు. అతి త్వరలోనే జంబుపట్నం గ్రామ ప్రజల నీటి కష్టాలు పూర్తిగా తొలగిపోతాయి," అని ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో యుద్ధప్రాతిపదికన జరుగుతున్న ఈ పనుల పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు చొంగ వెంకటేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు ఉల్లి సత్యనారాయణ, కేత బాలాజీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో పి.ఎం.ఎస్.ఎం.ఏ కార్యక్రమం...






**అడ్డతీగల ,పెన్ పవర్, జూలై10;** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెలా9,10 తేదీలలో నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం ఈనెల యధావిధిగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గైనకాలజిస్ట్ డాక్టర్ మోమినా హాజరై, 71 గర్భిణీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన 38 మందికి స్కానింగ్ చేసి 26 గర్భిణీలకు , రక్తహీనత గమనించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మిగతా కొంత వారిని పరీక్షించి ప్రసవ సమయం దగ్గరగా ఉన్నవారిని, ముందుగా వచ్చి ఆసుపత్రిలో జాయిన్ అవ్వాలని డాక్టర్ మోమీనా సూచించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, ఆశా వర్కర్లు మరియు ఏఎన్ఎంలకు హాస్పటల్ సూపర్డెంట్ పి .మహేష్ రెడ్డి భోజన వసతిని ఏర్పాటు చేశారు.
సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మహేష్ రెడ్డి అన్నారు.
కార్యక్రమంలో భాగంగా జనరల్ మెడిసిన్ డాక్టర్ నారాయణ,అనూష, రేష్మ మాట్లాడుతూ, ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా వ్యాప్తి చెందుతున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం డాక్టర్ మహేష్ రెడ్డి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల వ్యాప్తి, వాటి ప్రధాన లక్షణాల గురించి వివరించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా, తక్షణమే ఆసుపత్రికి వచ్చి వైద్య సలహాలు పొందాలని ఆయన స్పష్టం చేశారు.
కౌన్సిలర్ నారే. వాసు మాట్లాడుతూ, గర్భిణీలు గర్భం దాల్చినప్పటి నుండి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ,కొత్తగా వచ్చిన వారికి అలాగే పాత వారికి అవగాహన కల్పించి వివరించారు. ముఖ్యంగా ప్రసవ సమయంలో రక్తహీనత వంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ప్రాముఖ్యత గురించి తల్లులకు అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మరియు పెద్ద సంఖ్యలో గర్భిణీలు పాల్గొన్నారు. అలాగే ఎల్లవరం పి. హెచ్ .సి స్టాఫ్ పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కానివాడ పంచాయతీలో మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయం





- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వెల్లడి

**వై రామవరం /గుర్తేడు, పెన్ పవర్, జూలై 10 :** గుర్తేడు మండలంలోని కానివాడ పంచాయతీలో మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయుటకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని పోలవరం జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్ పేర్కొన్నారు.
గుర్తేడు మండలం కానివాడ, కొండ వెజువాడ గ్రామాలలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు గ్రామాల సందర్శన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుర్తేడు మండలం కాని వాడ, కొండ వేజువాడ గ్రామాలలో ఒక నెల ఒక నియోజకవర్గంలో నాలుగు సందర్శనలు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే విధంగా అధికారులను ఆదేశించడం జరిగిందని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని గిరిజనులకు రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు గ్రామాలలో పర్యటించాలని అన్నారు. గర్భిణీ స్త్రీలకు బాలింతలకు రక్తహీనత లేకుండా అంగన్వాడి కేంద్రాలలో పౌష్టిక ఆహారం అందజేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో వచ్చిన సమస్యల దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రభుత్వం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. త్రాగునీరు విద్యుత్ రహదారులు గృహాలు వివిధ రకాల పింఛన్లు ప్రతినెల రేషన్ సకాలంలో పంపిణీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక కుటుంబానికి 125 రోజులు విబిజి రాంజీ పనులు కల్పించడం, వివిధ రకాల సేవలు లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవడమే ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గ్రామంలోని పాఠశాల భవనం అంగన్వాడి కేంద్రానికి పక్క భవనాలు ఏర్పాటు చేయాలని ప్రజల కోరిక మేరకు అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గుంద్రాల గ్రామంలో గిరిజనులు సాగు చేయుచున్న పసుపు పంటను కలెక్టర్ పరిశీలించి ఎన్ని ఎకరాలు పసుపు పంట వేశారు ఎంత ఆదాయం వస్తుందని అడిగి తెలుసుకున్నారు. గుంద్రాల సమీపంలో కాల్వకు కల్వర్టు ఏర్పాటు ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించాలని సంబంధిత అధికారులు కలెక్టర్ ఆదేశించారు. కానివాడ గ్రామసభలో జిల్లా కలెక్టర్ వారికి గ్రామంలో సచివాలయ భవనం హెల్త్ వెల్నెస్ సెంటర్ ఆర్ఎస్కే భవనం పనులు మధ్యలో ఆగిపోయాయని వెంటనే భవనాల పనులు పూర్తి చేయించాలని గిరిజనులు కోరారు. మినీ పప్పుల ప్రాసెసింగ్ మిషన్లు అందజేయాలని కలెక్టర్ కు విన్నవించగా సంబంధిత అధికారులకు ఏర్పాటు చేయడం కృషి చేయడం జరుగుతుందని అన్నారు. రబ్బర్ టాపింగ్ పై రైతులకు శిక్షణ ఇవ్వాలని రబ్బరు రైతులు జిల్లా కలెక్టర్కు తెలియజేయగా వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి గుర్తేడు మండలంలోని రబ్బర్ రైతులకు మండల కేంద్రంలో రబ్బర్ టాపింగ్ పై రైతుల శిక్షణ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పెదలోవ మండల పరిషత్ పాఠశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నది ఎంతమంది విద్యార్థులు ఉన్నది ఆరా తీశారు . కాని వాడ ఘాట్ రోడ్ నుండి ఆహ్లాదకరమైన వ్యూ పాయింట్ని టూరిస్టులు ఆకర్షించే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 14వ తేదీ వరకు ఓటర్ జాబితాలోమార్పులు చేర్పులకు ఎక్కడికి అక్కడే పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం మీ భూమి మీ హక్కు ద్వారా ప్రతి గ్రామంలో రీ సర్వే నిర్వహించుటకు తగు చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. భూములు రీ సర్వే సమయములో సరిహద్దులకు సంబంధించి రైతులు ఇరువురు దగ్గర ఉండి సర్వే చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, జిల్లా ఉద్యానవన శాక అధికారి దేవాదానం,నరేంద్ర కుమార్ పంచాయతీ అధికారి నర్సింగరావు, డిఎంఒ భాస్కర్,ఎంపీపీ ఆనంద్, ఐ సి డి ఎస్ పిడి ఉమా,ఎంపీడీవో కే బాపన్న దొర, ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసరావు,రవికుమార్ డిఈలు సుబ్బారావు,ఏఈ సత్యనారాయణ,ఉపాధి హామీ ఏపీవో స్వామి, ఏపిఎం రాజబాబు, మాజీ సర్పంచ్ గొర్ల దృశ్యంతుడు, సరంకోట అబ్బాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు ఇవ్వొద్దు

**ఆదివాసీ సంక్షేమ పరిషత్**

**చింతూరు, పెన్ పవర్, జూలై 10:** పోలవరం ముంపు మండలాల్లో అర్హత లేని గిరిజనేతరులకు పునరావాస, పునఃస్థాపన ప్యాకేజీలు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. ఈ అంశంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సీఎస్‌టీ)కు ఫిర్యాదు చేయగా, కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్, ప్రత్యేక ఆర్‌అండ్‌ఆర్ అధికారి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. విచారణకు హాజరైన కుంజా శ్రీను తన బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక ముంపు మండలాల్లో ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ అర్హత లేని గిరిజనేతరులు అక్రమ మార్గాల్లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు పొందుతున్నారని ఆరోపించారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో భూములు, వనరులపై హక్కులు స్థానిక ఆదివాసీలకే ఉంటాయని, ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన గిరిజనేతరులకు ప్యాకేజీలు మంజూరు చేయడం రాజ్యాంగ ఉల్లంఘన అని ఆయన పేర్కొన్నారు. ఆర్‌అండ్‌ఆర్ సర్వేల్లో స్థానిక రెవెన్యూ అధికారుల సహకారంతో భారీ అక్రమాలు జరిగాయని, కొందరు గిరిజనేతరులు నాలుగు నుంచి ఐదు ఇళ్లు, వాణిజ్య భవనాలు ఉన్నట్లు తప్పుడు వివరాలు నమోదు చేసి కోట్ల రూపాయల లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో ఓటర్లుగా ఉండి అక్కడ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న వ్యక్తులు కూడా నకిలీ పత్రాలతో ముంపు ప్రాంతాల్లో ప్యాకేజీల జాబితాలో చేరినట్లు ఆధారాలతో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి భారీ ప్యాకేజీలు పొందిన గిరిజనేతరులు తిరిగి ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ, ఆదివాసీల భూములను ఆక్రమించి స్థిరపడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



ఆదివాసీలు తమ పూర్వీకుల భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ గిరిజనేతరులకు విక్రయించవద్దని సూచించారు. ఏజెన్సీ రక్షణ చట్టం 1/70 (ఎల్‌టీఆర్) నిబంధనలను ఉల్లంఘించి గిరిజనేతరులకు పోలవరం =ఒ= ప్యాకేజీలు మంజూరు చేస్తే ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో డివిజన్ వ్యాప్తంగా భారీ ఉద్యమాలు చేపడతామని కుంజా శ్రీను హెచ్చరించారు. ఈ విచారణ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కాకా సీతారామయ్య, యళ్లగడ్డ నాగేశ్వరరావు, పొడియం రాంబాబు తదితర ఆదివాసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ ల సందడి



**గండేపల్లి, పెన్ పవర్, జూలై ,10:** గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో 2026-2027 ప్రథమ సంవత్సరం అడ్మిషన్స్ ప్రక్రియ తో విద్యార్థులు వారి తల్లితండ్రుల తో కళాశాల సందడిగా మారింది. ఈ నెల 8వ తేదీ బుధవారం నుండి అడ్మిషన్ ప్రక్రియ మొదలు కాగా ఈ 11వ తేదీ శనివారం చివరి తేదీ కావడంతో విద్యార్థులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో వచ్చి రిపోర్ట్ చేస్తున్నారు. ఈ సంవత్సరం పాలిటెక్నిక్ అడ్మిషన్ లు నూటికి నూరు శాతం కౌన్సిలింగ్ ద్వారా ఫిల్ అయ్యాయని, జిల్లాలో మిగిలిన కళాశాలలతో పోలిస్తే ఆదిత్య కి నూటికి నూరు శాతం అడ్మిషన్లు జరిగాయి అని ప్రిన్సిపాల్ ఎస్.టి.ఎస్.వి.కుమార్ తెలిపారు. ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల అవలంబిస్తున్న మెరుగైన విద్యాప్రమాణాలు, ఈ.సెట్ లో స్టేట్ అత్యుత్తమ ర్యాంకులు తో పాటు, ప్రతిభ అవార్డు పొందడం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు(88%ప్లేస్ మెంట్ ) మెండుగా ఉండటం, 8 లక్షల వార్షిక ఆదాయం గల ఉద్యోగాలు పొందిన విద్యార్థులు ఆదిత్య విద్యార్థులు మాత్రమే అని, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో సమానంగా ఫాకల్టీ,ల్యాబ్,లైబ్రరీ సదుపాయాలతో మొదటి సంవత్సరం నుండే ప్లేసెమెంట్ ట్రైనింగ్ ఇవ్వడం తదితర కారణాలచే ఈ సంవత్సరం 1320 సీట్లు కు 1320 అడ్మిషన్ లు (100%అడ్మిషన్స్)తో ఇతర కళాశాల కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయని ప్రిన్సిపాల్ కుమార్ వివరించారు. ఈ నెల 15 తేదీ నుండి తరగతులు ప్రారంభమవుతాయని సి.ఎస్.ఈ. వారికి 15 వ తేదీన,మిగిలిన బ్రాంచ్ ల వారికీ 16 వ తేదీన తల్లితండ్రుల సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డీన్ ఏ.వి.మాధవరావు, అసోసియట్ డీన్ పి. శ్రీనివాస్ మరియు వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## మత్స్య రంగ అభివృద్ధికి శాస్త్రీయ సాగు పద్ధతులే కీలకం




**కాకినాడ, పెన్ పవర్, జూలై 10:**ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల మత్స్యశాస్త్రం, ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ మత్స్య రైతు దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలిపారు.ఈ కార్యక్రమానికి నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వాకల్చర్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దయ్యాహున్ ఖోంగ్లామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఆక్వాకల్చర్ రంగం మరింత అభివృద్ధి చెందాలంటే శాస్త్రీయ సాగు పద్ధతులు, సుస్థిర మత్స్య, రొయ్యల సాగు, నాణ్యమైన నీటి నిర్వహణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని సూచించారు. మత్స్యశాస్త్రం, ఆక్వాకల్చర్ రంగాల్లో యువతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మత్స్య మరియు ఆక్వాకల్చర్ రంగ అభివృద్ధికి విశేష సేవలు అందించిన ఉత్తమ మత్స్య రైతులు గారపాటి వేణు ప్రసాద్,వి. సత్యనారాయణ,పి.సతీష్ రాజుతో పాటు ఇతర రైతులను ముఖ్య అతిథి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే ఉద్దేశంతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలను అభినందించారు. మత్స్యశాస్త్రం, ఆక్వాకల్చర్ విభాగాధిపతి డాక్టర్ కె.ఎన్. మూర్తి కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.జాతీయ మత్స్య రైతు దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ, మత్స్య రైతులు,విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం పెంపొందించడం ద్వారా సుస్థిర ఆక్వాకల్చర్ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మత్స్య రైతులు, ఆక్వాకల్చర్ టెక్నీషియన్లు, అధ్యాపకులు,విద్యార్థులు, రంగ నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అధ్యాపకులు జి.భువన్ తేజ,కె.స్వాతి, ల్యాబ్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొని మత్స్య రైతులను అభినందించారు. జాతీయ మత్స్య రైతు దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన మత్స్యశాస్త్రం, ఆక్వాకల్చర్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.

## ద్రాక్షారామం అగ్నిప్రమాద బాధితులకు రూ.1.72 లక్షల ఆర్థిక చేయూత



**రామచంద్రపురం, పెన్ పవర్ జూలై 10:**ద్రాక్షారామం మార్కెట్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన వ్యాపారులను ఆదుకునేందుకు ది రామచంద్రపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ మానవతా దృక్పథంతో ముందుకొచ్చింది.బాధిత వ్యాపారుల సహాయార్థం సేకరించిన రూ.1,72,316 ఆర్థిక విరాళాన్ని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంకు శుక్రవారం అందజేసింది. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన మొత్తం 48 మంది వ్యాపారులకు ఈ సహాయాన్ని అందించేందుకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు చొరవ చూపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు మేరకు బాధిత వ్యాపారులకు అండగా నిలవడం సామాజిక బాధ్యతగా భావించి ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన రామచంద్రపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బాధితులకు అందిన ప్రతి రూపాయి వారి పునరావాసానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొవ్వూరి తాతారెడ్డి,కార్యదర్శి పసుపులేటి వీర వెంకట సత్యనారాయణమూర్తి,ఉపాధ్యక్షుడు కంచుమర్తి బాబురావు,ఛాంబర్ ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

# ఉమ్మడివరం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు







**డి.వై.డి.ఓ.అండ్.హెచ్.ఓ.ప్రశాంతి,డి.ఎం.ఓ.భాస్కర్, రావు, సంబంధిత అధికారులు**
**–రేఖపల్లి,వైద్యశాల డాక్టర్,నీలుఫర్,ఆయుర్వేద డాక్టర్, స్వర్ణలత,వైద్యశాల సిబ్బంది.**

**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.10** మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో శుక్రవారండి.వై. డి.ఓ.అండ్.హెచ్.ఓ.ప్రశాంతి,డి.ఎం.ఓ.భాస్కర్,రావు రేఖపల్లి,వైద్యశాల డాక్టర్,నీలుఫర్,ఆయుర్వేద,డాక్టర్, స్వర్ణలత,వైద్యశాలసిబ్బంది.ఆధ్వర్యంలోశిబిరాన్ని,ఏర్పాటుచేసి,ప్రజలకు అవగాహణ,కల్పించారు.అనంతరం సంబంధిత,అధికారులుగృహాలవారిగాప్రజల ఆరోగ్య,సర్వే చేపట్టారు.గృహాలచుట్టూ ప్రతిఒక్కరూ పరిసరాల పరి శుభ్రత,ను,చూసుకోవాలని,ప్రతి ఒక్కరూ కాచి సల్లారిచి, గోరువెచ్చని,త్రాగునీరు,త్రాగాలి,గృహాలచుట్టూ నీటి గుంట లలో,నీరు నిలువఉండకుండాచూసుకోవాలి.నీరు నిల్వలు ఉన్నట్లయితే,అక్కడదోమలునివాసాలుఏర్పాటు చేసుకొని దోమలు,లార్వాద్వారాఅభివృద్ధి చెంది వాటి ద్వారా డెం గ్యూ,కారక దోమలు వ్యాప్తి చెందుతాయని,ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలంటూ,ప్రజలకు అవగాహన కల్పించారు.అన్ని గ్రామాలలో సీజనల్ వ్యాధులు నివారణకు హెల్త్ క్యాంపులు ఏర్పాటుచేయడం,జరుగుతుందని,తెలిపారు.మండల ప్రజలు ఆరోగ్యంవిషయంలో,తగుజాగ్రత్త లు తీసుకుంటూ,ఆరోగ్యంగా ఉండాలని,కోరారు.ఈ వైద్య శిబిరంలో ప్రభుత్వ సంబంధిత,అధికారులు,రేఖపల్లి,వైద్య శాలడాక్టర్,నీలుఫర్,ఆయుర్వేద,డాక్టర్,స్వర్ణలత,పి.హెచ్. ఎన్.భద్రకాళి,స్థానిక ఆశ వర్కర్ ఏ.ఎన్.ఎం.వైద్యశాల సిబ్బంది.తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం





- పిఠాపురంలో "వన్ మంత్--వన్ విలేజ్--ఫోర్ విజిట్స్" కార్యక్రమానికి శ్రీకారం
- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ హారేంధిర ప్రసాద్

**పిఠాపురం, పెన్ పవర్, జూలై 10:**ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ఉద్దేశించిన "వన్ మంత్--వన్ విలేజ్--ఫోర్ విజిట్స్" కార్యక్రమాన్ని పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (పాడా) కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ హాజరయ్యారు.ఈ సందర్భంగా పాడా చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ డా. ఎన్.వి. శివరామ్ ప్రసాద్‌తో కలిసి పిఠాపురం నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, సంబంధిత శాఖల అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా నాలుగు వారాలపాటు "ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు" కార్యక్రమాన్ని పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలోనే సమస్యలను గుర్తించి, వాటికి తక్షణ పరిష్కారం చూపేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.పిఠాపురం ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు.ఈ కార్యక్రమంలో డీడీవో పి. వాసుదేవరావు, పిఠాపురం మున్సిపాలిటీ, డివిజన్, మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముద్రగడ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కిర్లంపూడి మసీద్ లో ప్రత్యేక ప్రార్ధనలు.





**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 10 :** హైదరాబాద్ సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి తిరిగి రావాలని కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి మదీనా జామియా మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మసీద్ కమిటీ పెద్దలు మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు, ప్రజా శ్రేయోభిలాషి ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి రావాలని శుక్రవారం మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించడమే కాకుండా, అల్లాను వేడుకున్నామన్నారు.అల్లా ఆశీస్సులతో ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి తిరిగి వస్తారని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ షాబుద్దీన్, ముస్లిం పెద్దలు మహమ్మద్ ఖయ్యూం భాషా,షేక్ ఇబ్రహీం(ఐ జి ) షేక్ అహ్మద్, షేక్ బషీర్, షేక్ కాలేషా, షేక్ కరీముల్లాషా, పలువురు కమిటీ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## నేడు గొల్లపాలెం, కుయ్యేరు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**కాజులూరు, పెన్ పవర్, జూలై 10:**సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా జూలై 11 (శనివారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గొల్లపాలెం, కుయ్యేరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. ఉదయ భాస్కర్ తెలిపారు.గొల్లపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్యవటం, గొల్లపాలెం,మొగలిపాలెం,శలపాక, తనుకువాడ,శీల,ఒంటితాడి, మంజేరు, గొర్రిపూడి,పెనుమల్ల,అంద్రంగి, తనుమల్ల,పెదపాటి గరువు, పెద్దాప్పురప్పాడు, విజయ రాయుడుపాలెం, జగన్నాథగిరి గ్రామాల్లోని గృహ విద్యుత్ వినియోగదారులతో పాటు ఆక్వా, పారిశ్రామిక ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.అలాగే కుయ్యేరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని దుగ్గదుర్రు,దుగ్గదుర్రుపాటి, మేకలగరువు, కుయ్యేరు,ఉప్పుమిల్లి, చింతలంక, రేగుబడవ గ్రామాలకు, అలాగే ఇండస్ట్రియల్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని దుగ్గదుర్రు, కుయ్యేరు, ఉప్పుమిల్లి,పల్లిపాలెం గ్రామాల పారిశ్రామిక,ఆక్వా ప్రాంతాలకు కూడా విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుంది.మరమ్మతు పనులు సజావుగా జరిగేందుకు సంబంధిత గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. ఉదయభాస్కర్ విజ్ఞప్తి చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రాయలసీమలో ఎకరా రూ.1.50 కోట్లు

**అనంతపురం జూలై 10, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణ కోసం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో దూసుకుపోతోంది. కొత్త ఇండస్ట్రియల్ పాలసీ, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానంతో పరిశ్రమలు, కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మారుతున్న పరిస్థితులకు తగిన విధంగా వ్యూహాలతో ముందుకు సాగుతోంది. తాజాగా ఏపీ ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్లలో అభివృద్ధి చేస్తున్న మూడు నోడ్‌లలో పరిశ్రమలకు భూమి కేటాయించడానికి ప్రత్యేకంగా పాలసీని తీసుకొచ్చింది. విశాఖపట్నం-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లలో ఉన్న కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లలో ఉన్న పరిశ్రమలకు ఈ పాలసీ వర్తిస్తుంది.ఏపీ ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్లలోని నోడ్‌లకు సంబంధించి పరిశ్రమలకు కేటాయించే భూముల ధరల్ని ఖరారు చేసింది. అత్యధికంగా నెల్లూరు జిల్లా క్రిస్ సిటీలో ఎకరా భూమిని రూ.1.74 కోట్లకు విక్రయించాలని నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లులోని నోడ్‌లో ఎకరా రూ.1.50 కోట్లుగా ఫిక్స్ చేశారు. కడప జిల్లాలో ఎకరా రూ.1.25 కోట్లు ఖరారు చేశారు. కేంద్రం నిర్ణయించిన ధరలే ఫిక్స్ చేశారు. ఏపీ పొరుగున్న ఉన్న కర్ణాటకతో పాటుగా మహారాష్ట్ర, గుజరాత్‌లో కూడా ఇలాగే క్లస్టర్లలో పరిశ్రమలకు భూములకు సంబంధించి ధరలు ఖరారు చేశారు. గుజరాత్, ముంబైలో ఎకార రూ.2.25 కోట్లకు ఫిక్స్ చేశారు. పారిశ్రామికవేత్తల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని చెబుతున్నారు.రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ నోడ్‌లకు సమీపంలో ఎకరా రూ.20 నుంచి 30 లక్షలకు భూములు అందిస్తున్నట్లు కేంద్రం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఈ ధరలతో పోలిస్తే ఇండస్ట్రియల్ నోడ్‌లలో భూముల ధరలు 3 నుంచి 4 రెట్లు ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. దీంతో కేంద్రం ఈ నోడ్‌లలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నందున ఈ ఖర్చును భరించి రాబట్టేందుకు వీలుగా కేంద్రం ధరల్ని ఫిక్స్ చేసింది. కాకపోతే ముందుకుగా వచ్చే ప్రాజెక్టులకు మాత్రం 25శాతం రాయితీ ఇచ్చేందుకు అనుమతించింది.. అది కూడా ప్రోత్సాహకం కింద ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఇండస్ట్రియల్ కారిడార్లకు సంబంధించిన భూముల్ని ఏ ధరకు విక్రయించాలో తమ నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరించాలని, ఐఆర్ఆర్‌కు సంబంధించి కేంద్రం నిబంధన విధించింది..

ఈ ధరలకే భూములు విక్రయించాల్సి ఉంటుందంటున్నారు అధికారులు.క్రిస్

సిటీలో ముందుగా ఈ భూములు కేటాయింపు ప్రారంభించాలని ప్లాన్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లలో కలిపి దశల వారీగా 29,254 ఎకరాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. రాష్ట్రం భూముల్ని కేటాయిస్తే.. కేంద్ర సంస్థ నిక్‌డిక్ట్ (నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్) అభివృద్ధి చేస్తోంది. మూడు నోడ్‌లలో కలిపి మొదటి దశలో భాగంగా మౌలిక సదుపాయాలకు మొత్తం 7,225 ఎకరాల్లో దాదాపు రూ.3,300 కోట్లు నిక్‌డిక్ట్ ఖర్చు చేస్తోంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పుంగనూరులో ఈవీ క్లస్టర్.. ప్రతి 30 కి.మీ.కు ఛార్జింగ్ స్టేషన్

- మొదటి పేజి తరువాయి

భాగస్వాములు కావాలని కొరియన్ సంస్థలను ఆయన ఆహ్వానించారు. దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్, సియోల్‌లో కొరియా ఆటో ఇండస్ట్రీస్ కోఆపరేషన్ ఏజెన్సీ (కేఏఐసీఏ) ఛైర్మన్ టేక్-సుంగ్ లీ నేతృత్వంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈవీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈవీ ఎకోసిస్టమ్‌లో భాగంగా పూర్తిస్థాయిలో ఏపీఎస్ఆర్టీసీ బస్సులను విద్యుదీకరించడం, గ్రీన్ కారిడార్లలో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం, పుంగనూరులో ప్రత్యేక ఈవీ క్లస్టర్‌ను నెలకొల్పడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ-మొబిలిటీ నగరాల అభివృద్ధికి, ఈవీ పరిశోధనలకు ప్రత్యేక గ్రాంట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా, ఈవీ బ్యాటరీలు, మాగ్నెట్‌ల తయారీకి అవసరమైన ముడిసరుకుల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీలో ఒక 'రేర్ ఎర్త్ కారిడార్' ఏర్పాటు చేయబోతున్నట్లు కీలక ప్రకటన చేశారు.రాష్ట్రంలో ఇప్పటికే బలమైన ఆటోమోటివ్ పరిశ్రమ ఉందని, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో సుమారు 100 కిలోమీటర్ల మేర ఆటోమోటివ్ విడిభాగాల ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. కియా మోటార్స్‌తో పాటు అశోక్ లేలాండ్, ఇసుజు, హీరో మోటోకార్ప్, అమర్ రాజా, అపోలో టైర్స్, భారత్ ఫోర్జ్ వంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నాయని గుర్తుచేశారు. అశోక్ లేలాండ్ సంస్థ సుమారు రూ. 2,500 కోట్ల పెట్టుబడితో లిథియం అయాన్ ఈ-బస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు."అనంతపురంలో కియా మోటార్స్ సాధించిన అద్భుత విజయమే మా ప్రభుత్వ నిబద్ధతకు, సామర్థ్యానికి నిదర్శనం" అని లోకేశ్ అన్నారు. కొరియా కంపెనీల కోసం ప్రత్యేకంగా రెండు ఆటో కాంపోనెంట్స్ పార్కులను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కియా క్లస్టర్ సమీపంలో ఒకటి, శ్రీసిటీ-చిత్తూరు-తిరుపతి కారిడార్‌లో మరొకటి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పార్కులలో ప్లగ్-అండ్-ప్లే షెడ్లు, ఉమ్మడి టెస్టింగ్ సౌకర్యాలు, పూర్తిస్థాయి సపోర్ట్ కోసం ఒక 'కొరియా డెస్క్' కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ఏపీఎస్ఎస్‌డీసీ, కౌశలం ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈవీ పవర్‌ట్రెయిన్‌ల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు ఒక అకాడమీని ఏర్పాటు చేయాలని, ఇందుకు రాష్ట్రంలోని 250కి పైగా ఇంజనీరింగ్ కళాశాలల సహకారం తీసుకోవాలని కొరియన్ సంస్థలను కోరారు. ఇరు ప్రాంతాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ)లో ప్రత్యేక కొరియా డెస్క్, ఒక ఉమ్మడి వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు లోకేశ్ ప్రకటించారు.

## జేఎన్‌టీయూ స్నాతకోత్సవం విజయనగరంలోనే జరపాలి

- మొదటి పేజి తరువాయి

మనపై ఉంది. కాబట్టి, విజయనగరం జిల్లా వాసుల సెంటిమెంట్‌ను పరిగణనలోకి తీసుకుని, యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవాన్ని విజయనగరంలోనే నిర్వహించేలా ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించండి" అని తన లేఖ ద్వారా బొత్స కోరారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు

- మొదటి పేజి తరువాయి

సాగునీటి నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టుల్లోకి నీరు వస్తున్నప్పటికీ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఈటల ఆరోపించారు. వర్షాకాలంలోనూ సాగునీరు అందక రైతులు కష్టాలు పడుతున్నారని, ముఖ్యంగా ఎస్ఆర్ఎస్పీ కాల్వల కింద బోర్లు, బావులు లేకుండా వ్యవసాయం చేయడం సాధ్యం కాదని చెప్పారు.తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం కోసమే జరిగిందని ఈటల గుర్తుచేశారు. రాజకీయాలు, సిద్ధాంతాలు వేరైనా మూలాలను మరచిపోవద్దన్నారు. కాళేశ్వరం కంటే ముందే వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా ప్రాణహిత జలాలను తీసుకురావాలనే ప్రణాళిక రూపొందిందని, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్టులకు అప్పుడే శ్రీకారం చుట్టారని వివరించారు.స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టును అభివృద్ధి చేసి ఎల్లంపల్లికి నీటిని తరలించే వ్యవస్థ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో ఉన్న 29 టీఎంసీల నీరు కూడా ఆ ప్రాజెక్టుల ద్వారానే వచ్చిందన్నారు. కాళేశ్వరం వల్లే హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రెండు పంటలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, డిజైన్ మార్పులపై తాను మాట్లాడడం లేదని, కానీ మొత్తం ప్రాజెక్టునే తప్పుపట్టడం సరికాదని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రాజెక్టు పరిధిలోని దెబ్బతిన్న నిర్మాణాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే రాష్ట్రం తీవ్ర కరవును ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# బీజేపీ నేతల మౌనం ఎందుకో...

**విశాఖపట్టణం, జూలై 10, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ బీజేపీలో ఏదో జరుగుతుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ పెద్దగా రాజకీయంగా యాక్టివ్ గా లేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంపై ప్రత్యర్థులు విమర్శలు చేస్తున్నప్పటికీ దానికి సరైన కౌంటర్ మాత్రం ఇవ్వడం లేదు. బీజేపీ నేతల మౌనం వెనక అర్థం ఏంటన్నది ఇప్పటికీ కూటమిలోని ప్రధాన పక్షాలైన టీడీపీ, జనసేనలకు అర్థం కాకుండా ఉంది. రాష్ట్ర నేతలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారా? లేదా కేంద్ర నాయకత్వం నుంచి ఏమైనా ఆదేశాలు ఉన్నాయా? అన్న అనుమానం అందరిలోనూ కలుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు పూర్తి కావస్తున్నప్పటికీ కమలం పార్టీ రాష్ట్ర నేతలు మాత్రం సంతోషంగా లేరు. తమ నియోజకవర్గాల్లో... అనేక నియోజకవర్గాల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న చోట టీడీపీ, జనసేన నుంచి తమకు మద్దతు లభించడం లేదని రివర్స్ లో బీజేపీ నేతలు ఈ విధమైన నిరాసక్తతతో ఉన్నారని చెబుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ పది స్థానాల్లో పోటీ చేసింది. ఎనిమిది స్థానాల్లో విజయం సాధించింది. అలాగే ఆరు లోక్ సభ స్థానాలకు పోటీ చేసి మూడింటిలోవిజయం సాధించింది. అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి , కైకలూరు నుంచి కామినేని శ్రీనివాస్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సుజనా చౌదరి, ఆదోని నుంచి డా. పి.వి. పార్థసారథి, జమ్మలమడుగు నుంచి ఆదినారాయణ రెడ్డి, ధర్మవరం నుంచి సత్య కుమార్ యాదవ్, ఎచ్చెర్ల నుంచి నడుకుదిటి ఈశ్వరరావు ఎన్నికయ్యారు. విశాఖపట్నం ఉత్తరం నుంచి పెన్మెత్స విష్ణు కుమార్ రాజులు ఎన్నికయ్యారు. రాజమండ్రి పార్లమెంటు నుంచి దగ్గుబాటి పురంధేశ్వరి, అనకాపల్లి సీఎం రమేష్, నర్సాపురం నుంచి భూపతిరాజు శ్రీనివాసవర్మలు ఎన్నికయ్యారు. దీంతో పాటు మాధవ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు... కానీ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలున్నప్పటికీ ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. అసలు కూటమి ప్రభుత్వంతో తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం పై వస్తున్న ఆరోపణల విషయంలోనూ పెద్దగా స్పందించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం.. కూటమి సర్కార్ లో తమకు ప్రాధాన్యత దక్కకపోవడం ఒక కారణమయితే, మరొక ముఖ్యమైన కారణం.. తమ నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్ ఛార్జుల పెత్తనం సాగుతుండటమేనని చెబుతున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర నాయకత్వానికి కొందరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే సంయమనం పాటించాలని, రానున్న కాలంలో అంతా సర్దుకుంటుందని నాయకత్వం చెప్పిందట. అయినా సరే కూటమిలో మిత్రధర్మం పాటించకుండా వ్యవహరించడంపై టీడీపీ, జనసేనలో కొంత అసంతృప్తి అయితే మొదలయింది. తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావం, రుతుపవనాల లోపం వల్ల వ్యవసాయానికి తీవ్ర ఆటంకం కలిగి కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి.

# రోడ్డున పడుతున్నారు.. జనసేనకు లాభమెంత..!



**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన పరిస్థితి హైకమాండ్ దగ్గర ఒకలా ఉంటే.. క్షేత్రస్థాయిలో మరోలా ఉండడం ఆ పార్టీకి కూడా శ్రేయస్కరం కాదన్న అభిప్రాయం వ్యక్తమయ్యేలా చేస్తోంది. పార్టీని డెవలప్ చేయాలని.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం దక్కించుకునేలా నాయకులు వ్యవహరించాలని జనసేన అధినేత పిలుపునిస్తు న్నారు. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఎక్కడికక్కడ నాయకులు ఎవరికి వారు తమ పంతం నెగ్గించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. చిత్రం ఏంటంటే.. టీడీపీ నాయకులు-వైసీపీ నాయకుల మధ్య వివాదాలతో పోలిస్తే.. జనసేనలో సొంత నేతలపైనే వివాదాలు వస్తున్నాయి. ఒకరిపై ఒకరు కీచులాడుకునే పరిస్థితి.. అనంతరం కేసులు పెట్టుకు నే పరిస్తితి కూడా వస్తోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ ఎమ్మెల్యేపై పార్టీ నాయకులు.. ఫిర్యాదు లు చేస్తున్నారు. అలానే.. పోలవరం ఎమ్మెల్యే కుటుంబంపై సొంత నేత చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ఉత్తరాంధ్రలో కూడా జనసేన పరిస్థితి దీనికి భిన్నంగా ఏమీ లేదు. జనసేన పార్టీకి చెందిన ఎమ్మెల్యేల్లోనే అంతర్గత వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకరంటే ఒకరికి పడకపోవడం.. ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకోవడం గమనార్హం. ఇటీవల శ్రీకాకుళం జిల్లాకు చెందిన నాయకులు.. ఓ ఎమ్మెల్యేపై ఫిర్యాదులు చేయడం ఈ పరంపరలో భాగంగానే చూడాలి. అలాగే.. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే.. సొంత నేతలపై చిరాకు ప్రదర్శించే పరిస్థితి వచ్చింది. దీనికి కారణం.. ఆయనకు వ్యతిరేకంగా చక్రం తిప్పుతుండడమే.

ఇలా.. రాష్ట్ర వ్యాప్తంగా జనసేన ఎమ్మెల్యేలు సగానికి పైగా వివాదాల్లోనే చిక్కుకున్నారు. ఈ వివాదాలు పొరుగు పార్టీల నుంచి వస్తే.. రాజకీయంగా ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుంది. కానీ.. సొంత నేతల నుంచి వివాదాలు రావడం.. విమర్శలు చోటు చేసుకోవడం వంటివి గమనిస్తే.. ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయన్నది ప్రధాన చర్చ. ఇప్పటికైనా ఎమ్మెల్యేలు వాస్తవాలను గ్రహించి.. సర్దుకు పోయే ధోరణిని ప్రదర్శించాలి. కానీ, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం.. సంస్థాగతంగా పార్టీలో ఉన్నవారిని దూరం పెట్టడం వంటివి తగ్గించాలి.

# టీడీపీలోకి హితేష్

**ఒంగోలు జూలై 10, పెన్ పవర్:**
తెలుగుదేశం పార్టీలోకి మరో యువనేత ఎంట్రీకి రంగం సిద్ధం అయినట్లు తెలుస్తోంది. నందమూరి తారకరామారావు మనవడు దగ్గుబాటి హితేష్ త్వరలో పార్టీలో చేరుతారని తెలుస్తోంది. ఆయన మాజీ మంత్రులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి ల కుమారుడు. ఆయన పూర్తి పేరు హితేష్ చెంచురాం. గతంలో కుటుంబంలో నెలకొన్న విభేదాలు సమసి పోవడంతో చేరికకు మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది . ప్రస్తుతం దగ్గుబాటి పురందేశ్వరి భారతీయ జనతా పార్టీలో ఉన్నారు. ఆ పార్టీ ఎంపీగా కొనసాగుతున్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఉన్నారు. దశాబ్దాలుగా చంద్రబాబుతో ఉన్న విభేదాలు సమసిపోవడంతో హితేష్ టిడిపిలో చేరికకు రంగం సిద్ధం అయింది. ఈ మేరకు చంద్రబాబు సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో హితేష్ సైకిల్ ఎక్కడం ఖాయం అన్నట్లు తెలుస్తోంది.దగ్గుబాటి వెంకటేశ్వరరావు నందమూరి తారక రామారావు అల్లుడు. సీఎం చంద్రబాబుకు స్వయానా తోడల్లుడు. 1983 నుంచి 2009 వరకు క్రియాశీలక రాజకీయాల్లో నడిచారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1985, 1989, 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. 1991లో మాత్రం ఎంపీగా విజయం సాధించారు. 1996లో రాజ్యసభకు ఎంపికయ్యారు. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆయనపై టిడిపి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలిచారు. సుదీర్ఘకాలం పరుచూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం అక్కడ టిడిపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఉన్నారు. అయినా సరే హితేష్ టిడిపిలో చేరి రాజకీయాలు చేయాలని భావిస్తున్నారుపురందేశ్వరి సైతం తన భర్త వెంకటేశ్వరరావుతో కలిసి 2004లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాపట్ల నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. రెండోసారి విశాఖ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో మంత్రిగా కూడా

వ్యవహరించారు. అయితే ఆమె తర్వాత బిజెపిలో చేరగా.. ఆమె భర్త వెంకటేశ్వరరావు మాత్రం వైసీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో వెంకటేశ్వరరావు వైసీపీలో ఓడిపోయిన తర్వాత సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయారు. వాస్తవానికి చంద్రబాబుతో విభేదించి టిడిపి నుంచి బయటకు వచ్చేసారు. ఇప్పుడు అదే చంద్రబాబుతో విభేదాలు పూర్తిగా సమసి పోయాయి. పైగా సోదరుడు లోకేష్ తో హితేష్కు మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే లోకేష్ టీమ్ లో చేరేందుకు హితేష్ రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. చంద్రబాబు నుంచి సైతం గ్రీన్ సిగ్నల్ లభించడంతో త్వరలో హితేష్ టిడిపిలో చేరనున్నారు.

# 68 మండలాల్లో డేంజర్

**విజయవాడ, జూలై 10, పెన్ పవర్:**
ఏపీలో వర్షాభావం కనిపిస్తోంది. జూలై రెండవ వారం దాటుతున్న ఆశించిన స్థాయిలో వర్షాలు పడడం లేదు. సాగునీటి జలాశయాలు, ప్రాజెక్టుల్లో నీరు లేదు. డెడ్ స్టోరేజ్ కు చేరుకున్నాయి నిల్వలు. మరోవైపు ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమైంది కానీ.. వర్షాలు లేక ఆశించిన స్థాయిలో పనులు ముందుకు వెళ్లడం లేదు. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు పడ్డాయి కానీ.. ప్రస్తుతానికి ముఖం చాటేసాయి. వరి విత్తనాలు చల్లి వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు అన్నదాతలు. ప్రస్తుతం పరిస్థితి చూస్తుంటే మాత్రం ఖరీఫ్ ప్రమాదకరమే అని అర్థం అవుతోంది. ఈ తరుణంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమయింది. ఈ వాతావరణ విపత్తుని ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది.ప్రధానంగా ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. అది మన రాష్ట్రంపై స్పష్టంగా కనిపించింది. నైరుతి రుతుపవనాల రాక కూడా ఆలస్యం అయ్యింది. జూన్ రెండో వారానికి రాష్ట్రానికి రుతుపవనాలు తాకాయి. తీవ్ర వర్షాభావం నెలకొంది. వర్షపాతం లోటు కనిపిస్తోంది. జూన్లో మైనస్ 25 వర్షపాతం లోటు నమోదు కాగా.. జూలైలో ఇప్పటివరకు మైనస్ 41 శాతం వర్షపాతం లోటు నమోదయింది. సాధారణంగా జూన్ నుంచి నవంబర్ వరకు నైరుతీ రుతుపవనాలు విస్తరిస్తాయి. ఖరీఫ్ కు ఇవే ప్రధానం. ఈ సీజన్ మొత్తం మైనస్ 27% వర్షపాతం లోటుతో ముగిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.ఉమ్మడి 13 జిల్లాల్లో 68 మండలాలు ఉన్నాయి. అందులో ఎల్ నినో ప్రభావం 105 మండలాలపై తీవ్రంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. 208 మండలాలపై మాత్రం మద్యస్థ స్థాయిలో ప్రభావం ఉండనుంది. ప్రధానంగా శ్రీ సత్య సాయి, అన్నమయ్య, అనంతపురం జిల్లాలపై ప్రభావం ఉండనుంది. మద్యస్థ స్థాయి ప్రభావం కర్నూలు, నంద్యాల, చిత్తూరు, వైయస్సార్ కడప, తిరుపతి, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాలపై ఉండనుంది. నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ కీలక సూచనలు చేస్తోంది.

**ఉరుములు, పిడుగులు.. ఆ జిల్లాలకు హై అలెర్ట్!**

ఏపీ వ్యాప్తంగా చల్లటి వాతావరణం కొనసాగుతోంది. అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. కానీ పూర్తిస్థాయిలో మాత్రం కురవడం లేదు. ఇంకా వర్షపాతం లోటు కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెదర్ అప్డేట్ ఇచ్చింది. నాలుగు జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వానలు పడతాయని తెలిపింది. అయితే భారీ వర్షాలు నమోదు కావడం లేదు. ఎల్ నినో ప్రభావం స్పష్టంగా ఉంది. ఖరీఫ్ అదును దాటుతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులపాటు కొనసాగితే ఇబ్బందికర పరిస్థితులు తప్పేలా లేవు. అయితే నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండడంతో కొంత ఆశలు రేగుతున్నాయి.ఐదు రోజులపాటు నైరుతీ రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈరోజు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో చెదురు మదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే ఛాన్స్ కనిపిస్తోంది.

పిడుగులు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. రైతులతోపాటు పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేస్తున్నారు.ఏపీ పై ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం తేలికపాటి వర్షాలు తప్ప.. భారీ వర్షాలు నమోదు కావడం లేదు. నైరుతి రుతుపవనాలు సైతం ఆలస్యం అయ్యాయి. పెద్దగా ప్రభావం సైతం కనిపించడం లేదు. ఖరీఫ్ పంటలపై ప్రభావం కనిపిస్తోంది. ఈ ఏడాది ఇలానే కొనసాగితే కష్టం అని రైతుల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది. మరోవైపు ఎల్ నినో హెచ్చరికల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ప్రత్యామ్నాయ పంటలను సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులు ఈ పంటలపై సూచనలు అందిస్తున్నారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలో వర్షపాతం లోటు ఉంటుందని ముందుగానే అంచనా వేశారు. కానీ రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఆకాశం మేఘావృతమై కనిపించినా.. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదు. ఇది కచ్చితంగా రైతులకు లోటు.

# సిక్సర్ల మోజు తగ్గించుకోవాలి.. వైభవ్, అభిషేక్‌పై బీసీసీఐ ఫోకస్!

- ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో భారత్ పేలవ ప్రదర్శన
- అభిషేక్ శర్మ, వైభవ్ ఆటతీరుపై బీసీసీఐ ప్రత్యేక దృష్టి
- సిక్సర్లు బాదే ఉత్సాహం నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందని బీసీసీఐ ఆలోచన
- ఇన్నింగ్స్‌ను నిర్మించే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని సూచించే యోచన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత జట్టు పేలవ ప్రదర్శన నేపథ్యంలో యువ ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై బీసీసీఐ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వీరిద్దరి దూకుడు బ్యాటింగ్, భారీ షాట్లపై ఆధారపడే ధోరణిని బోర్డు నిశితంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. “అభిషేక్, వైభవ్‌కు సిక్సర్లు బాదే సామర్థ్యం అద్భుతంగా ఉంది. కానీ ఆ ఉత్సాహాన్ని నియంత్రించుకోవడం కూడా నేర్చుకోవాలి” అని బీసీసీఐకి చెందిన ఓ అధికారి వ్యాఖ్యానించినట్లు పలు కథనాలు పేర్కొన్నాయి.

15 ఏళ్ల వయసులోనే భారత్ తరఫున అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ ఇప్పటివరకు ఇంగ్లండ్ సిరీస్‌లో 14, 13, 15 పరుగులకే పరిమితమయ్యాడు. అయితే ఐపీఎల్-2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 776 పరుగులు, 72 సిక్సర్లతో అదరగొట్టిన అతడు ఆరెంజ్ క్యాప్‌తో పాటు పలు అవార్డులు కూడా గెలుచుకున్నాడు. మరోవైపు అభిషేక్ శర్మ మాత్రం ఇంగ్లండ్ సిరీస్‌లో 59, 43, 10, 16 పరుగులు చేసినా మ్యాచ్‌ను మలుపుతిప్పే ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. దీంతో యువ ఓపెనర్ల దూకుడుతో పాటు పరిస్థితులకు తగ్గట్టుగా ఇన్నింగ్స్‌ను నిర్మించుకునే నైపుణ్యాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం.

# కోచ్ గంభీర్ పదవికి గండం?.. టీమిండియా ప్రదర్శనపై బోర్డు సీరియస్!

- ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ కోల్పోయిన టీమిండియా
- ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది ప్రదర్శనపై బీసీసీఐ సమీక్ష
- హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పదవిపై కూడా పడనున్న ప్రభావం
- కెప్టెన్సీ మార్పు తర్వాత వరుసగా రెండో సిరీస్ ఓటమి
- భారత్‌పై ఇంగ్లండ్‌కు ఇదే తొలి ద్వైపాక్షిక టీ20 సిరీస్ విజయం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను భారత జట్టు కోల్పోవడంతో బీసీసీఐ తీవ్రంగా స్పందించింది. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది ప్రదర్శనపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పదవి కూడా పరిశీలనలో ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. గంభీర్ కాంట్రాక్టు 2027 వరకు ఉన్నప్పటికీ, జట్టు వరుస వైఫల్యాల నేపథ్యంలో అతని పనితీరును కూడా సమీక్షించనున్నట్లు తెలుస్తోంది. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని టీమిండియా, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బ్రిస్టల్‌లో జరిగిన నాలుగో టీ20లో 9 వికెట్ల తేడాతో ఘోర పరాజయం పాలైంది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఇంగ్లండ్ 3-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. సిరీస్‌లోని తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, రెండో మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో, మూడో మ్యాచ్‌లో ఏకంగా 125 పరుగుల భారీ తేడాతో భారత్ ఓడిపోయింది. మూడో మ్యాచ్‌లో 202 పరుగుల లక్ష్య ఛేదనలో కేవలం 76 పరుగులకే కుప్పకూలడం జట్టు పేలవ బ్యాటింగ్‌కు అద్దం పట్టింది. ప్రస్తుత టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా ఉన్న టీమిండియాకు ఇది వరుసగా రెండో టీ20 సిరీస్ ఓటమి కావడం గమనార్హం. ఇంగ్లండ్ పర్యటనకు ముందు, పసికూన ఐర్లాండ్ చేతిలో భారత్ 2-0 తేడాతో సిరీస్ కోల్పోయింది. ఐర్లాండ్‌పై భారత జట్టుకు అదే తొలి సిరీస్ పరాజయం. ఈ రెండు సిరీస్ ఓటములు ఒక కీలక మార్పు తర్వాత చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది. 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించి, అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు బీసీసీఐ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. ఈ సాహసోపేత నిర్ణయం తర్వాత జట్టు వరుసగా విఫలమవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇదిలా ఉంటే.. రెండు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌లున్న ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో భారత్‌పై ఇంగ్లండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఈ నేపథ్యంలో జట్టులో సమూల మార్పులు ఉంటాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. త్వరలో జరగనున్న సమీక్ష తర్వాత బీసీసీఐ కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

# కోచ్ గంభీర్ పదవికి గండం?.. టీమిండియా ప్రదర్శనపై బోర్డు సీరియస్!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను భారత జట్టు కోల్పోవడంతో బీసీసీఐ తీవ్రంగా స్పందించింది. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది ప్రదర్శనపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పదవి కూడా పరిశీలనలో ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. గంభీర్ కాంట్రాక్టు 2027 వరకు ఉన్నప్పటికీ, జట్టు వరుస వైఫల్యాల నేపథ్యంలో అతని పనితీరును కూడా సమీక్షించనున్నట్లు తెలుస్తోంది. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని టీమిండియా, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బ్రిస్టల్‌లో జరిగిన నాలుగో టీ20లో 9 వికెట్ల తేడాతో ఘోర పరాజయం పాలైంది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఇంగ్లండ్ 3-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. సిరీస్‌లోని తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, రెండో మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో, మూడో మ్యాచ్‌లో ఏకంగా 125 పరుగుల భారీ తేడాతో భారత్ ఓడిపోయింది. మూడో మ్యాచ్‌లో 202 పరుగుల లక్ష్య ఛేదనలో కేవలం 76 పరుగులకే కుప్పకూలడం జట్టు పేలవ బ్యాటింగ్‌కు అద్దం పట్టింది. ప్రస్తుత టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా ఉన్న టీమిండియాకు ఇది వరుసగా రెండో టీ20 సిరీస్ ఓటమి కావడం గమనార్హం. ఇంగ్లండ్ పర్యటనకు ముందు, పసికూన ఐర్లాండ్ చేతిలో భారత్ 2-0 తేడాతో సిరీస్ కోల్పోయింది. ఐర్లాండ్‌పై భారత జట్టుకు అదే తొలి సిరీస్ పరాజయం. ఈ రెండు సిరీస్ ఓటములు ఒక కీలక మార్పు తర్వాత చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది. 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించి, అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు బీసీసీఐ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. ఈ సాహసోపేత నిర్ణయం తర్వాత జట్టు వరుసగా విఫలమవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇదిలా ఉంటే.. రెండు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌లున్న ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో భారత్‌పై ఇంగ్లండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఈ నేపథ్యంలో జట్టులో సమూల మార్పులు ఉంటాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. త్వరలో జరగనున్న సమీక్ష తర్వాత బీసీసీఐ కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.


# ఆ రెండు భాగాలను మించిన కష్టంతో రాజమౌళి!

భారతీయ చలనచిత్ర చరిత్రను మలుపు తిప్పిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తాజాగా మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం -వారణాసి- వేదికగా తన మేకింగ్ మ్యాజిక్‌ను ప్రదర్శించడానికి సిద్ధమవుతున్నారు. -బాహుబలి- వంటి భారీ చిత్రాల కోసం ఎంతగా శ్రమించారో? అంతకు మించిన కష్టాన్ని వారణాసి షూటింగ్ కోసం పడుతున్నారని తెలుస్తోంది. సాధారణంగా రాజమౌళి సినిమాలు అనగానే భారీ సెట్లు, వందల కోట్ల బడ్జెట్ గుర్తుకొస్తాయి. కానీ -వారణాసి-లో జరుగుతున్న షూటింగ్ అందుకు భిన్నంగా, సహజసిద్ధమైన లొకేషన్లలో అత్యంత క్లిష్టమైన సవాళ్లతో సాగుతోంది. అవసరం మేర వారణాసి సెట్లు వేసి కొంత షూటింగ్ చేసినా? రియల్ లొకేషన్స్ లో చేసిన సీన్స్ వేరే లెవల్లో ఉంటాయి.



ఆధునిక సౌందర్య ప్రమాణాలకు శ్రీనిధి శెట్టి కొత్త నిర్వచనం

-వారణాసి-లోని గంగా తీరం, పురాతన కట్టడాలు , జనసమ్మర్థం ఎక్కువగా ఉండే వీధుల్లో షూటింగ్ చేయడం ఏ దర్శకుడికైనా పెద్ద పరీక్ష. భారీ సెట్లు నిర్మించే అవకాశం లేని ప్రాంతంలో ఉన్న వాతావరణాన్ని కథకు తగ్గట్టుగా మలచుకోవడం రాజమౌళికి పెద్ద సవాలుగా మారింది.



-బాహుబలి-లో సాంకేతిక పరిజ్ఞానంతో దృశ్యాలను సృష్టిం చడం ఒక ఎత్తు అయితే? ప్రకృతిని , సహజ సౌందర్యాన్ని కథాంశంతో మేళవించడం మరో ఎత్తు. అందుకే ఈ చిత్రం కోసం ఆయన ఎంతో శ్రద్ధతో ప్రణాళికలు రచిస్తున్నారు. వాస్తవానికి వారణాసిలో షూటింగ్ చేయడం అంటే సాంకేతికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కోవడమే. పరిమితమైన స్థలంలో భారీ కెమెరా సెటప్‌లను అమర్చడం, వెలుతురును కంట్రోల్ చేయడం, పర్యాటకుల రద్దీని తట్టుకుని షూటింగ్ జరపడం వంటివి సాధారణ విషయం కాదు. కానీ రాజమౌళి పట్టుదలతో ఈ సవాళ్లను అధిగమిస్తున్నారు. ఒక్కో సన్నివేశాన్ని ఆశించిన స్థాయిలో చిత్రీకరించడానికి ఆయన పడుతున్న తపన, కెరీర్‌లో ఇప్పటివరకు చూడని డెడికేషన్ కు నిదర్శనమని యూనిట్ సభ్యులు చెబుతున్నారు.

ఈ ప్రాజెక్ట్ కోసం రాజమౌళి అనుసరిస్తున్న మేకింగ్ శైలి పూర్తిగా భిన్నంగా ఉందని సమాచారం. -బాహుబలి- లాంటి పీరియాడిక్ డ్రామాలో సెట్లు ప్రాణం పోస్తే ఈ చిత్రంలో వారణాసి నగరమే ఒక పాత్రలా కనిపిస్తుందిట. నగరంలోని వైబ్రేషన్స్‌ను, ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా ప్రతి ఫ్రేమ్‌ను రాజమౌళి తీర్చిదిద్దుతున్నారు. భారీ గ్రాఫిక్స్ పైన కాకుండా సహజత్వాన్ని పండించే అంశాలపైనే రాజమౌళి ఎక్కువ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇది రాజమౌళిలోని వైవిధ్యమైన దర్శకుడిని మరోసారి ప్రపంచానికి పరిచయం చేస్తుంది.-బాహుబలి- విజయం తర్వాత రాజమౌళి చేసే ఏ సినిమా అయినా సరే ఆ అంచనాలను అందుకోవాల్సిందే. అందుకే రాజమౌళి ఏ చిన్న విషయాన్ని కూడా వదిలిపెట్టకుండా పని చేస్తున్నారు. వారణాసిలో రాజమౌళి పడుతున్న కష్టం, థియేటర్లలో ప్రేక్షకులకు ఓ సరికొత్త దృశ్య కావ్యాన్ని పరిచయం చేస్తుందని నమ్మకం కలుగుతోంది. మేకింగ్ పరంగా ఎదురవుతున్న ఇబ్బందులను కూడా రాజమౌళి ఆనందంగా భరిస్తున్నారు అంటే, సినిమా ఫలితం ఏ రేంజ్ లో ఉండబోతుందో ఊహించుకోవచ్చు. బ్లాక్ ఫారెస్ట్ లాంటి కఠినమైన లొకేషన్లలో షూటింగ్ అంతకు రెండితలు కష్టపడాల్సి ఉంటుంది. ఇక్కడ ఇంకా సవాళ్లు ఎదురవుతాయన్నది అంతే వాస్తవం.



ప్రణితా సుభాష్ తాజా ఫొటోషూట్ అందరినీ ఆకట్టుకుంటోంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965